
ఆంధ్రజ్యోతి
గరిష్ఠం 30.5
కనిష్ఠం 23.8
ANDHRAJYOTHY



నల్లగొండ
3
శుక్రవారం 5 సెప్టెంబరు 2025

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	587.20 (300.0450)	84,995	51,884
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643.52 (4.07)	1,774.75	2,193.71
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	173.292 (43.1584)	35,800	17,000

చికెన్ ధరలు | లైవ్ : రూ.120 | డ్రెస్ : రూ.200 | స్కిన్‌లెస్ : రూ.220



ప్రభుత్వశాఖల్లో అధికారులు, ఉద్యోగుల అవినీతి ఆగడం లేదు. తరచూ ఏసీబీకి పట్టుబడుతున్నా లంచాలు పుచ్చుకునేందుకు ఏ మాత్రం వెనకంజ వేయడం లేదు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఎలాంటి లంచాలు తీసుకోకుండా పారదర్శకంగా సిటిజన్ చార్టర్ ప్రకారం పనులు నిర్వహించాల్సిన అధికారులు వాటిని గాలికివదిలేసి యథేచ్ఛగా అవినీతికి పాల్పడుతూ పనులు చక్కబెడుతున్న తీరు తరచూ వెలుగులోకి వస్తోంది. ఎలాంటి బెదురు లేకుండా ఏకంగా పనిచేసే కార్యాలయాల్లోనే లంచాలు తీసుకుంటూ పట్టుబడుతున్నారు. ఆమ్యామ్యాలు ఇవ్వపోతే నెలల తరబడి కార్యాలయాల చుట్టూ తిరిగినా పనులు కావడం లేదని, అదే దొడ్డిదారిలో అయితే చిటికెలో పనిచేసి పెడుతున్నారనే ఆరోపణలు అన్ని శాఖల అధికారులపై ఉన్నాయి.

- (ఆంధ్రజ్యోతి ప్రతినిధి,నల్లగొండ)

తీరు మారడం లేదు!



ఏసీబీకి పట్టుబడిన చరితారెడ్డి

- ఏసీబీకి పట్టుబడుతున్నా మారని ఉద్యోగులు
- ఉమ్మడి జిల్లాలో చిక్కుతున్న అవినీతి తిమింగలాలు
- సగటున నెలకో కేసు నమోదు
- కీలకశాఖల్లో రాజ్యమేలుతున్న అవినీతి
- కేసుల విచారణలో జాప్యమూ కారణమే

ప్రతీ సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే 'ప్రజావాణి'కి వచ్చే ఫిర్యాదుల్లో లంచాలు ఇవ్వలేనిస్థితిలో ఉన్న బాధితులే ఉంటున్నారని తెలుస్తోంది. గురువారం నల్లగొండ జిల్లా మత్స్యశాఖ అధికారి చరితారెడ్డి తన కార్యాలయంలోనే మత్స్యసొసైటీ సభ్యుల నుంచి రూ.20వేలు లంచం తీసుకుంటూ పట్టుబడడం చర్చనీయాంశమైంది.

కీలకశాఖలకు అవినీతి మకిలి..

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఈ ఏడాది సగటున నెలకో అవినీతి తిమింగలాన్ని ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. వరుసగా ఏసీబీకి పట్టుబడి ఉద్యోగాలు కోల్పోతున్నా మిగిలిన వారిలో ఏమాత్రం బెదురు ఉండడం లేదు. ఈ ఏడాది తాజాగా చరితారెడ్డి కేసుతో కలిపి 8 ఏసీబీ కేసులు నమదవ్వగా, గత ఏడాది 11 కేసులు నమోదయ్యాయి. ప్రధానంగా విద్యుత్, రెవెన్యూ, పోలీసశాఖలోని అధికారులే ఏసీబీకి పట్టుబడుతున్నారు. అయితే మునిసిపల్, పట్టణ ప్రణాళిక, రిజిస్ట్రేషన్లు, ల్యాండ్ సర్వే శాఖల్లోనూ అవినీతి రాజ్యమేలుతుందనే ఆరోపణలు ఉన్నాయి. పలువురు బాధితులు నేరుగా ఫిర్యాదులు చేయలేక బతిమాలో, భంగపడో పనులు చేయించుకుంటున్నామని పలువురు చెబుతున్నారు.

సగుటన నెలకో కేసు..

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 2024లో 11 ఏసీబీ కేసులు నమోదు కాగా, ఈ ఏడాది ఇప్పటివరకు 8 కేసులు నమోదయ్యాయి. గురువారం నాటి ఘటనలో జిల్లా స్థాయి అధికారే ఏసీబీకి పట్టుబడ్డారు. అయితే ఏసీబీకి పట్టుబడిన తక్షణం విధుల నుంచి సస్పెండ్ చేయగా, తిరిగి ఐదారు నెలల తర్వాత సస్పెన్షన్ ఎత్తివేయించుకొని మళ్లీ ఉద్యోగాల్లో చేరుతున్నారని, కోర్టుల్లోనూ కేసులు సంవత్సరాల తరబడి కొనసాగుతుండడంతో కఠిన చర్యలకు ఆయా శాఖలలో జాప్యం జరుగుతోందని పలువురు అభిప్రాయపడుతున్నారు. అంతేగాక ప్రజాప్రతినిధుల అండదండలతో ఏసీబీకి పట్టుబడ్డ అధికారులు సైతం మళ్లీ కీలక పోస్టింగులు పొందుతుండడంతో ఏసీబీ కేసుల్లో పట్టుబడిన సమయంలో కనిపించిన భయం, ఆతర్వాత ఉద్యోగుల్లో లేకుండా పోయిందనే అభిప్రాయం వెల్లడవుతోంది.

ఈ ఏడాది కేసులు ఇలా..

- జనవరి 12న సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నియోజకవర్గం తిరుమలగిరిలో పీడీఎస్ బియ్యం అక్రమరవాణా కేసులో ఎస్‌ఐ సురేష్, కానిస్టేబుల్ నాగరాజు రూ.70వేల లంచం తీసుకుంటూ పట్టుబడ్డారు.
- మార్చి 6న యాదాద్రి జిల్లా చౌటుప్పల్‌లో ట్రాన్స్‌కో ఏడీ శ్యాంప్రసాద్ ఓ ఫార్మాకంపెనీకి విద్యుత్ కనెక్షన్ ఇచ్చేందుకు, మీటర్ మార్చేందుకు రూ.70వేల లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కారు.
- ఏప్రిల్ 10న సూర్యాపేట జిల్లా

- మిగతా 6వ పేజీలో...

నేడు గణేష్ నిమజ్జన
శోభాయాత్ర



14వ మైలు వద్ద నిమజ్జన ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నిమజ్జనానికి ఏర్పాట్లు పూర్తి

నల్లగొండ కల్చరల్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నవరాత్రులు భక్తుల పూజలు అందుకున్న గణనాథుడు నేడు తల్లి గంగమ్మ ఒడికి చేరనున్నాడు. ఈ మేరకు జిల్లా వ్యాప్తంగా గణేష్ నిమజ్జన శోభాయాత్రలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. విగ్రహాలను నిమజ్జనం చేయనున్న చెరువుల వద్ద అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు, చర్యలు తీసుకుంటున్నారు. మునిసిపాలిటీలు, స్థానిక సంస్థలు, రెవెన్యూ, పోలీస్, ట్రాన్స్‌కో, ఇరిగేషన్, మత్స్య, ఎక్సైజ్, ఆర్‌అండ్‌బీ, వైద్యఆరోగ్య తదితర ప్రభుత్వ శాఖలు, గణేష్ ఉత్సవ సమితులు సంయుక్తంగా నిమజ్జన ఏర్పాట్లలో భాగస్వాములయ్యాయి. జిల్లా కేంద్రంలో హనుమాన్‌నగర్‌లోని తొలి విగ్రహం వద్ద ఉదయం 8.30గంటలకు ప్రత్యేక పూజల్లో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్ పాల్గొని శోభాయాత్రను లాంఛనంగా ప్రారంభించనున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, శాంతిసంఘం, ఉత్సవ సమితి సభ్యులు పాల్గొని శోభాయాత్రను ముందుండి నడిపించనున్నారు. హనుమాన్‌నగర్ నుంచి మొదలయ్యే శోభాయాత్ర పట్టణ పుర వీధుల నుంచి సాగనుంది. పట్టణంలో నెలకొల్పిన వినాయకుడి విగ్రహాలన్నీ వరుస క్రమంలో క్లాక్ టవర్ సెంటర్ మీదుగా తరలివెళ్లే

- మిగతా 6వ పేజీలో...

నేరశోధనలో సీసీ కెమెరాల
పాత్ర కీలకం

- ఎస్పీ శరత్‌చంద్ర పవార్
- సీసీ కెమెరాల పనితీరును పరిశీలించిన కలెక్టర్ ఇలా త్రిపాఠి



సీసీ కెమెరాల ఏర్పాటు కోసం వ్యాపారవేత్తల రూ.10లక్షల చెక్కును కలెక్టర్ త్రిపాఠి, ఎస్పీ శరత్‌చంద్రపవార్‌కు అందజేస్తున్న ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, ఎమ్మెల్యే బీఎల్‌ఆర్

మిర్యాలగూడ, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నేరాల పరిశోధనలలో సీసీ కెమెరాల పాత్ర కీలకంగా మారిందని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అన్నారు. గురువారం టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, నేర నియంత్రణ, నేరం జరిగిన తరువాత వేగవంతమైన దర్యాప్తునకు సీసీ కెమెరాలు ఎంతగానో తోడ్పడతాయన్నారు. జిల్లాలోని హైవేలపై, ప్రధాన కూడళ్లు, వ్యాపార కేంద్రాలు, ఐసోలేటెడ్ ప్రాంతాల్లో ఆటోమేటెడ్ నెంబర్‌ప్లేట్ ఐడెంటిఫై సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. వీటి ద్వారా వాహనాల నెంబర్‌ప్లేట్ల వివరాలు తెలుస్తాయని అన్నారు. మిర్యాలగూడలో 96 కెమెరాలు ఏర్పాటు చేయగా, వాటితో కలిపి జిల్లాలో మొత్తం 2,300 కెమెరాలు ఉన్నాయన్నారు. అన్ని కెమెరాలు జిల్లా కేంద్రంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు, హైదరాబాద్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ సెంటర్‌కు అనుసంధానం చేశామన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటు కోసం పట్టణ వ్యాపారవేత్తలు ఇచ్చిన రూ.10లక్షల చెక్కును ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో డీఎస్పీ రాజశేఖర్‌రాజు అందజేశారు. కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ నారాయణ్‌అమిత్, సీఐలు సోమనర్సయ్య, నాగభూషణం, పీఎస్‌డీ ప్రసాద్, ఎస్‌ఐలు సైదిరెడ్డి, అమ్రిన్, కాంగ్రెస్ నాయకులు వేణుగోపాల్ రెడ్డి, చిలుకూరి బాలు, ముదిరెడ్డి నర్సిరెడ్డి, పొదిల శ్రీనివాస్ పాల్గొన్నారు.

చారిత్రక వారసత్వాన్ని నిలబెట్టుకోవాలి

తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర నేత హరికృష్ణ



ముల్కీ డే సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతున్న హరికృష్ణ

మిర్యాలగూడ, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ చారిత్రక వారసత్వాన్ని నిలబెట్టుకోవాలని తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర నేత బెల్లంకొండ హరికృష్ణ అన్నారు. గురువారం ముల్కీ డే సందర్భంగా టీవీవీ ఆధ్వర్యంలో పట్టణంలోని విజేత డిగ్రీకళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ అస్తిత్వాన్ని, సంస్కృతిని, రాజకీయాలను దెబ్బతీసే చర్యలను సమాజం సహించదని అన్నారు. 1952 లెగైర్ ముల్కీ ఉద్యమానికి, 1969 తొలిదశ ఉద్యమానికి, మలిదశ ఉద్యమానికి ఊతమిచ్చిందని అన్నారు. నీళ్లు, నియామకాలు, వనరులు, సంపద కోసం కొట్లాడిన తెలంగాణలో పొట్టకూటికి వచ్చిన దేశ, విదేశీయులకు బతక నీడనిచ్చిందన్నారు. పొట్టకొట్టాలని చూస్తే ఈ ప్రాంతం నుంచి తరిమివేసే చరిత్ర ముల్కీ ఉద్యమంకాలం నుంచే కొనసాగుతోందని అన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ తెడ్ల ధనుంజయ, వైస్ ప్రిన్సిపాల్ మధు, చారి, యాదయ్య, దుర్గయ్య, రాజారాం, పాల్గొన్నారు.

గణితశాస్త్ర జాతీయ సదస్సు విజయవంతం

ఎంజీయూ వీసీ అల్తాఫ్ హుస్సేన్

నల్లగొండ, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గణిత శాస్త్ర జాతీయ సదస్సు విద్యార్థులను పరిశోధనల వైపు ఆసక్తి కలిగించేలా సాగిందని, ఈ సదస్సు విజయవంతంగా పూర్తయిందని ఎంజీయూ వీసీ అల్తాఫ్ హుస్సేన్ అన్నారు. గురువారం ఎంజీయూలో రెండు రోజుల పాటు నిర్వహించిన గణిత విభాగం జాతీయ సదస్సు ముగింపు సందర్భంగా ఆయన మాట్లాడారు. పలు యూనివర్సిటీల నుంచి అధ్యాపకులు హాజరై గణిత శాస్త్ర విషయాలను వివరించారన్నారు. అదేవిధంగా విద్యార్థులు పరిశోధనా పత్రాలను సమర్పించారన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ ఆల్వాల రవి, డాక్టర్ హైమావతి, శ్రీనివాస్, ఉపేందర్‌రెడ్డి, కిరణ్‌కుమార్, రామచంద్ర, సముద్రాల ఉపేందర్, తదితరులు పాల్గొన్నారు.

వీధి కుక్కలను నియంత్రించేందుకు చర్యలు

కలెక్టర్ ఇలా త్రిపాఠి



జంతు జనన నియంత్రణ కేంద్రానికి శంకుస్థాపన కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

మిర్యాలగూడ, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): వీధికుక్కల జనాభాను నియంత్రించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు కలెక్టర్ ఇలా త్రిపాఠి చెప్పారు. గురువారం అవంతీపురంలో రూ.60లక్షల వ్యయం తో రెండెకరాల స్థలంలో నిర్మించనున్న జంతు జన న నియంత్రణ కేంద్రం నిర్మాణానికి ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, ఎమ్మెల్యే బీఎల్‌ఆర్, సబ్‌కలెక్టర్ నారాయ ణ్ అమిత్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఇటీవల కాలంలో చిన్నారులపై వీధి కుక్కల దాడులు ఎక్కువయ్యాయని అన్నారు. వీధి కుక్కల జనాభాను నియంత్రించేందుకు హైదరాబాద్ తప్ప మరెక్కడా జంతు జనన నియంత్రణ కేంద్రాలు లేవని అన్నారు. దాన్ని దృష్టిలో ఉంచుకుని జిల్లా కేంద్రంలో లాగానే మిర్యాలగూడలో కూడా జంతు జనన నియంత్రణ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఎన్జీవో సంస్థతో ఒప్పందం చేసుకున్నట్లు తెలిపారు. వీధి, పెంపుడు కుక్కలకు వ్యాక్సిన్ వేయించాలని సూచించారు. దేవరకొండలో సైతం జంతు జనన నియంత్రణ కేంద్రం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఎమ్మెల్సీ శంకర్ నాయక్ మాట్లాడుతూ, కుక్కకాటు ప్రమాదమని, నిర్లక్ష్యం చేస్తే రేబిస్ వచ్చే అవకాశం ఉందన్నారు. ఎమ్మెల్యే బీఎల్‌ఆర్ మాట్లాడుతూ జంతు జనన నియంత్రణ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. అనంతరం వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. మున్సిపల్ కార్యాలయంలో కార్మికులకు నిర్వహించిన వైద్యశిబిరంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ రమేశ్, మునిసిపల్ కమిషనర్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

సమీకృత పాఠశాలకు భూసేకరణ చేపట్టాలి

(ఆంధ్రజ్యోతి, నిడమనూరు): నిడమనూరు మండలం ఊట్కూరులో నిర్మించనున్న సమీకృత పాఠశాల సముదాయానికి సత్వరమే భూసేకరణ చేపట్టాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. గురువారం ఊట్కూరు గ్రామంలోని 358, 361 సర్వే నెంబర్లలోని ప్రభుత్వ భూమిని అధికారులతో కలిసి ఆమె పరిశీలించి మాట్లాడారు. ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణానికి 15 నుంచి 20ఎకరాల వరకు భూమి అవసరం ఉందన్నారు. రెండు సర్వే నెంబర్లలో 10ఎకరాల వరకు ప్రభుత్వ భూమి అందుబాటులో ఉందని అధికారులు వివరించగా, మరో ఐదు నుంచి ఏడు ఎకరాల వరకు భూసేకరణ చేపట్టాలని సూచించారు. పాఠశాలకు భూమి ఇచ్చే రైతులకు అనుముల మండలం ఇబ్రాహీంపేట వద్ద భూమి లేదా ధర చెల్లించి కొనుగోలు చేయడానికి సిద్ధమేనన్నారు. ఆమె వెంట సబ్ కలెక్టర్ అమిత్‌నారాయణ్, తహసీల్దార్ జంగాల కృష్ణయ్య, ఎంపీడీవో బోనగిరి రమేష్, మార్కెట్ కమిటీ చైర్మన్ అంకతి సత్యం, డీఈ శైలజ, సర్వేయర్ విజయ్‌కుమార్, మాజీ సర్పంచులు నర్సింగు కృష్ణయ్య, విజయ్‌కుమార్, శివమారయ్య, పోలే రవి, రూపని కృష్ణయ్య, తదితరులు ఉన్నారు.

ఓటింగ్ యంత్రాల తనిఖీ...

(ఆంధ్రజ్యోతి, నల్లగొండ): కలెక్టరేట్ గోదాంలోని ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్ని రాజకీయ పక్షాల ప్రతినిధులతో కలిసి గురువారం తనిఖీ చేశారు. ఈవీఎంల పరిశీలన అనంతరం రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో గోదాంకు సీల్ చేయించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, కలెక్టరేట్ ఏవో మోతిలాల్, ఎన్నికల విభాగం డీటీ విజయ్ కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

చరిత్రను వక్రీకరిస్తున్న బీజేపీ

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ

నల్లగొండ రూరల్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట చరిత్రను బీజేపీ వక్రీకరిస్తోందని సీపీఎం రాష్ట కార్యదర్శి జాన్‌వెస్లీ విమర్శించారు. గురువారం దొడ్డికొమరయ్య భవనంలో జరిగిన సీపీఎం జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వాతంత్రోద్యమంలో, వీర తెలంగాణ సాయుధ పోరాటంలో బీజేపీ నాయకులు ఎవ్వరూ పాల్గొనలేదని స్పష్టం చేశారు. చరిత్రను వక్రీకరించడంలో బీజేపీ అందవేసిన చేయి అన్నారు. సాయుధ పోరాటాన్ని హిందూ ముస్లింల పోరాటంగా చిత్రీకరించేందుకు యత్నిస్తోందన్నారు. దున్నేవాడికే భూమి, స్వేచ్ఛ కోసం సాయుధ పోరాటం సాగిందని గుర్తుచేశారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వార్షికోత్సవాలను ఈ నెల 10 నుంచి 17వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్నామని, వీటిలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్నా శ్రీశైలం సొరంగం మార్గం పనులను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి, పోతినేని సుదర్శన్, జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి, ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, నారి ఐలయ్య, డబ్బికార్ మల్లేశం, బండ శ్రీశైలం, పాలడుగు నాగార్జున, కందాల ప్రమీల, సయ్యద్ హాషం, పాలడుగు ప్రభావతి, చిన్నపాక లక్ష్మీనారాయణ, వీరపల్లి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

వినాయకుడికి 108 రకాల నైవేద్యం



గణేష్ నవరాత్రుల ముగింపు సందర్భంగా నార్కట్‌పల్లిలోని వాసవీ భవన్‌లో 108 రకాల ప్రసాదాలతో గణనాథుడికి నైవేద్యం సమర్పించారు.

● ఆంధ్రజ్యోతి, నార్కట్‌పల్లి

ప్రతీ ఒక్కరు రక్తదానం చేయాలి

టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావా రవి

నల్లగొండ, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రక్తదానం ప్రాణదానంతో సమానమని, ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావా రవి అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్ర ఆస్పత్రిలో నిర్వహించిన రక్తదానం శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. రక్తదానంతో ఆపదలో ఉన్న వారికి ఎంతో ప్రయోజనం చేకూరుతుందన్నారు. రక్తదాన శిబిరాన్ని డీఈవో బొల్లారం భిక్షపతి సందర్శించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి, టీజీఈజేఏసీ జిల్లా చైర్మన్ నాగిళ్ల మురళి, టీఎస్‌యూటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బక్క శ్రీనివాసచారి, పెరుమాళ్ల వెంకటేశం, శేఖర్‌రెడ్డి, భిక్షం, రణదీవే, నర్రా శేఖర్‌రెడ్డి, గ్యారే నర్సింహ, నలపరాజు వెంకన్న, రమాదేవి, సైదులు, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులుగా
208 మంది ఎంపిక

నల్లగొండ, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా 208మందిని విద్యాశాఖ ఎంపిక చేసింది. గురువారం సాయంత్రం ఈ మేరకు విద్యాశాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. 2025 సంవత్సరానికి ఈ అవార్డులను ప్రకటించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ఉదయం 11గంటలకు నిర్వహించే కార్యక్రమంలో ఉపాధ్యాయులకు ఈ అవార్డులను రోడ్లు భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అందజేయనున్నారు. ఆయనతోపాటు ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు హాజరవుతారని డీఈవో భిక్షపతి తెలిపారు.

రాష్ట్ర ఉత్తమ అధ్యాపకుడిగా శ్రీధర్

నల్లగొండలోని నాగార్జున ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన అధ్యాపకుడు వెల్దండి శ్రీధర్‌కు రాష్ట్రస్థాయి ఉత్తమ అధ్యాపక అవార్డు లభించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ సముద్రాల ఉపేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీధర్ రెండేళ్లుగా ఎన్జీ కళాశాలలో తెలుగు అధ్యాపకుడిగా పనిచేస్తున్నారు.

యూరియా కష్టాలకు కేంద్రమే కారణం

సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి



రైతులతో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జూలకంటి

మిర్యాలగూడ, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో యూరియా కొరతకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలే కారణమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి ఆరోపించారు. గురువారం పట్టణంలోని మండల ప్రాథమిక సహకర కేంద్రాన్ని ఆయన సందర్శించి రైతులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. యూరియా ఎంత వచ్చింది? నిల్వలు ఉన్నాయా? అని సొసైటీ అధికారులను ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులకు అవసరమైన యూరియాను తెప్పించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ప్రభుత్వాల ముందస్తు ప్రణాళికా లేకపోవడంతో రైతులు ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీయేతరర ప్రభుత్వాలు ఉన్న రాష్ట్రాలకు కేంద్రం యూరియా కేటాయింపును తగ్గించి రైతులకు తీరని అన్యాయం చేస్తోందని విమర్శించారు. యూరియా కొరతతో వరి దిగుబడి భారీగా తగ్గే అవకాశం ఉందన్నారు. సొసైటీల వద్ద రైతులు వంతుల వారీగా లైన్‌లో నిలబడినా యూరియా అందడం లేదని అన్నారు. భూమిలో విత్తనం వేసిన నాటినుంచి పంట చేతికి వచ్చే వరకు రైతులు ప్రకృతి వైపరీత్యాలతో కష్టాలు ఎదుర్కొంటున్నారన్నారు. రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని తక్షణమే తగినంత యూరియా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వీరేపల్లి వెంకటేశ్వర్లు, సీపీఎం మండల కార్యదర్శి రవినాయక్, బావాండ్ల పాండు, నాగేశ్వరావునాయక్, తదితరులు పాల్గొన్నారు.

యూరియా.. ఏదయా?

● బస్తా యూరియా కోసం 12గంటల పాటు పాట్లు ● యూరియా కోసం మహిళా రైతుల అవస్థలు ● తెల్లవారుజాము 4 నుంచి సాయంత్రం వరకు నిరీక్షణ



క్యూలైన్‌లో చెప్పులు

మఠంపల్లి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలంలో రైతులకు సరిపడా యూరియా దొరక్కపోవడంతో ఆందోళనకు దిగారు. తెల్లవారుజామున నుంచే చెప్పులు పెట్టి క్యూలైన్‌లో ఉన్న పడిగాపులు కాసిన రైతులు యూరియా పంపిణీ చేసేందుకు అధికారులు సిద్ధమవుతున్న తరుణంలో ఒక్కసారిగా గోదాంలోకి ఎగబడ్డారు.దీంతో కొంతసేపు రైతులకు తోపులాట జరిగింది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని రైతులకు నచ్చజెప్పి పోలీస్ పహారా నడుమ యూరియా పంపిణీ చేశారు. మండల నలుమూలల నుంచి వచ్చిన రైతులకు సహకార సొసైటీకి కేవలం 300 బస్తాల యూరియా ఉండటంతో చాలామంది రైతులు నిరాశకు గురయ్యారు. రెండు, మూడు రోజుల్లో పూర్తిస్థాయిలో యూరియా సరఫరా చేస్తామని సహకార సంఘం అధికారులు తెలిపారు.

హుజూర్‌నగర్ సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణంలోని వ్యవసాయ సహకార పరపతి సంఘానికి బుధవారం 30 టన్నుల 666 బస్తాల యూరియా వచ్చింది. విషయం తెలుసుకున్న రైతులు గురువారం తెల్లవారు జామున 4 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు రైతులు యూరియా కోసం బారులు తీరారు. వెయ్యి మందికి పైగా రైతులు పట్టణంలోని సహకార సంఘం వద్దకు వచ్చి పడిగాపులు కాశారు. ముఖ్యంగా మహిళా రైతులు, వృద్ధాప్యంలో ఉన్న మహిళా రైతులు కూడా యూరియా కోసం తరలి రావడం గమనార్హం. పురుషులతోపాటు మహిళా రైతులు కూడా యూరియా కోసం గంటల కొద్దీ బారులు తీరారు. కాగా హుజూర్‌నగర్ సహకార సంఘం పరిధిలో 3వేలకు పైగా సభ్యత్వం కలిగిన రైతులు ఉన్నారు. హుజూర్‌నగర్ సహకార సంఘం, రెవెన్యూ పరిధిలో సుమారు 18వేల ఎకరాల ఆయకట్టు ఉంది. హుజూర్‌నగర్, మాధవరాయనిగూడెం, గోవిందాపురం, అనుములగూడెం ప్రాంతాల్లోని రైతులంతా యూరియా కోసం అధికం సంఖ్యలో తరలివచ్చారు. మహిళలు ఒక క్యూలైన్లో, పురుషులు మరో క్యూలైన్లో నిల్చున్నారు. తెల్లవారు జాము నుంచి సాయంత్రం 4 గంటల వరకు యూరియా అందజేయగా సుమారు 150 మందికి పైగా రైతులు యూరియా దొరకక వెనుదిరిగారు. రోజంతా పొలాలకు వెళ్లకుండా పడిగాపులు కాసినా యూరియా దొరకలేదని పలువురు రైతులు ఆవేదన వ్యక్తంచేశారు. తెల్లవారు జామున వచ్చిన రైతులు సాయంత్రం వరకు పస్తులు ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. సుమారు 12 గంటల పాటు రైతులు యూరియాకోసం ఎదురుచూసినా యూరియా లేకపోవడంతో నిరాశ, నిస్పృహలతో వెనుదిరిగారు.

రైతు ఘోష

రైతులపట్ల నిర్లక్ష్యంగా..

హుజూర్‌నగర్ పట్టణంలోని సహకార సంఘంలో పనిచేసే ఉద్యోగులు రైతుల పట్ల నిర్లక్ష్యం చేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. యూరియా కోసం వచ్చిన రైతులతో దూషణలకు దిగుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. పట్టణంలోని బడా భూస్వాములకు, ఉద్యోగుల బంధువులకు మాత్రమే అత్యధికంగా ప్రాధాన్యమిస్తూ యూరియా బస్తాలు సరఫరా చేస్తున్నట్లు విమర్శలు ఉన్నాయి. మండలంలో మొత్తం 5 సహకార సంఘాలు ఉండగా రైతులకు పూర్తి స్థాయిలో యూరియా కొరత ఏర్పడింది. రైతులకు వారానికి ఒకటిరెండుసార్లు మాత్రమే యూరియా సరఫరా చేస్తున్నారు.

రెండు లక్షల ఎకరాల ఆయకట్టు

హుజూర్‌నగర్ డివిజన్ పరిధిలో సుమారు రెండు లక్షల ఎకరాల ఆయకట్టు ఉండగా, అందులో లక్షా 30వేల ఎకరాలు వరి, 30వేల ఎకరాల్లో పత్తితోపాటు మిగిలిన ఇతర పంటలు సాగుచేస్తున్నారు. కాగా లక్షా 60వేల ఎకరాలకు యూరియా 25వేల టన్నులు అవసరం ఉంది. ఇప్పటివరకు కేవలం 7వేల టన్నుల యూరియా మాత్రమే ప్రభుత్వం రైతులకు సరఫరా చేసింది. మూడో వంతు మాత్రమే యూరియా సరఫరా కావడంతో రైతులు రెండు నెలలుగా ఎదురుచూస్తున్నారు.

సొమ్మసిల్లిన మహిళా రైతు

హుజూర్‌నగర్ పట్టణంలోని గోవిందాపురానికి చెందిన దాసరి సిలువ రాణి అనే 55 ఏళ్ల మహిళా రైతు వ్యవసాయ సహకార పరపతి సంఘం వద్ద యూరియా కోసం వచ్చి సొమ్మసిల్లి పడిపోయింది. గురువారం తెల్లవారు జామున 4 గంటల నుంచి మహిళా రైతులు కూడా క్యూలో ఉన్నారు. కాగా తెల్లవారుజామున వచ్చిన ఆమె ఆహారం తీసుకోలేదు. కాగా రైతులు యూరియా కోసం పెద్ద ఎత్తున తరలిరావడంతో ఒక్కసారిగా స్పృహతప్పింది. పక్కనే ఉన్న రైతులు మంచినీళ్లు తాగించారు. 10 నిమిషాల అనంతరం తేరుకున్న ఆమె యూరియా తీసుకోకుండానే వెనుదిరిగింది.



పడరాని పాట్లు

తుంగతుర్తి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): యూరియాకోసం రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. మూడు రోజులుగా ఇదిగో యూరియా.. అదిగో యూరియా వస్తుందంటూ రోజు సహకార బ్యాంకు వద్దకు వచ్చి వెళుతున్నారు. గురువారం యూరియా రైతు సేవా సహకార సంఘానికి వచ్చిందని తెలియడంతో ఉదయం నుంచి రైతులు క్యూలో నిలబడ్డారు. క్యూలో నిలబడే ఓపిక లేకపోవడంతో రైతులు తమ చెప్పులను క్యూలో పెట్టి పక్కకు, నీడకు కొంతమంది, మరి కొంతమంది ఎండలో నిలిచి తమ వంతు వచ్చేవరకూ వేచి ఉండి ఒక్కో బస్తా తీసుకొని వెళ్లారు.





బారులు తీరి...

కట్టంగూరు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కట్టంగూరులో యూరియా కోసం పీఏసీఎస్ వద్ద రైతులు గంటల తరబడి బారులుతీరారు. ఉదయం తెల్లవారుజాము నుంచి యూరియాకోసం అధిక సంఖ్యలో రైతులు ఎగబడ్డారు. దీంతో కట్టంగూరు ఎస్ఐ రవీందర్ పోలీస్ సిబ్బందితో వచ్చి పోలీసుల పర్యవేక్షణలో యూరియాను పంపిణీచేశారు. కట్టంగూరుకు గురువారం 444 యూరియా బస్తాలు రాగా ఒక్కొక్క రైతుకు ఒక బస్తా చొప్పున పంపిణీ చేసినట్లు మండల వ్యవసాయ అధికారి గిరి ప్రసాద్ తెలిపారు.

సజావుగా పంపిణీ

ఆత్మకూర్(ఎస్): ఆత్మకూర్(ఎస్), నెమ్మికల్ కేంద్రాల్లో 25 మెట్రిక్ టన్నుల యూరియా రాగా, ఒక రైతుకు రెండు బస్తాల చొప్పున పంపిణీ చేశారు. రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా వ్యవసాయాధికారులు జాగ్రత్తలు తీసుకున్నారు. మండల వ్యవసాయాధికారి దివ్య, ఇతర శాఖల అధికారుల సమన్వయంతో రైతులకు యూరియా ను పంపిణీ చేశారు. మరో 30 మెట్రిక్ టన్నుల యూరియా గురువారం రాత్రికి వస్తుందని, శుక్రవారం నెమ్మికల్, ఆత్మకూర్(ఎస్) పీఏసీఎస్ కేంద్రాల వద్ద పంపిణీ చేస్తామని ఏవో దివ్య తెలిపారు.

అద్దంకి-నార్కట్‌పల్లి రహదారిపై ధర్నా



మాడ్గులపల్లి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని అద్దంకి-నార్కట్‌పల్లి రహదారిపై రైతులు యూరియాకోసం గురువారం రోడ్డెక్కారు. యూరియా మండల కేంద్రానికి తక్కువ మోతాదులో పంపించడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. గురువారం 200 బస్తాల యూరియా రావడంతో ఆధార్‌కార్డుకు ఒక బస్తా చొప్పున పంపిణీ చేయడంతో రైతులకు యూరియా సరిపోకపోవడంతో రైతులు చేసేదేమి లేక అద్దంకి-నార్కట్‌పల్లి రహదారిపై గంటసేపు ఆందోళన చేపట్టారు. పోలీసులు జోక్యం చేసుకొని వ్యవసాయశాఖతో మాట్లాడి ఒక లారీ యూరియాను జిల్లాకేంద్రం నుంచి రప్పించడంతో అవి కూడా రైతులకు పంపిణీ చేశారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా యూరియా అందిస్తామని వ్యవసాయాధికారులు చెప్పడంతో ఆందోళన విరమించారు.

పోలీసు పహారా నడుమ

ఆలేరు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆలేరు పట్టణంలోని సింగిల్‌విండో ఆధ్వర్యంలో గురువారం యూరియా సరఫరా చేపట్టగా మండలంలోని రైతులు ఎగబడ్డారు. రైతులు అధిక సంఖ్యలో తరలి వచ్చి ఎగబడడంతో కార్యాలయ ఉద్యోగులు పంపిణీ చేయడం కొద్దిసేపు నిలిపివేశారు. క్యూలో వరుసగా యూరియా పంపిణీ చేస్తామన్నారు.

దాంతో రైతులు క్యూలైన్‌లో నిలబడడంతో పోలీసులను రప్పించి వారి ఆధ్వర్యంలో యూరియా పంపిణీని రైతుకు ఒకటి చొప్పున పంపిణీ చేశారు. సుమారు 450 బ్యాగుల యూరియా స్టాక్ రావడంతో కేవలం మూడు గంటల్లోనే పంపిణీ పూర్తి చేశారు. క్యూలో నిలబడిన రైతులు కొందరికి యూరియా లభించకపోవడంతో వారు నిరాశకు గురయ్యారు. త్వరలోనే యూరియా మరింత స్టాకు రానుందని, దాంతో యూరియా కొరత తీరిపోతుందని రైతులు ఆందోళన చెందవద్దని వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు విజ్ఞప్తి చేశారు.

ఆగ్రహించిన రైతులు

మిర్యాలగూడ రూరల్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): వరి సాగుకు సిద్ధమైన రైతన్నకు అందుబాటులో ఉండేలా యూరియా అందించాల్సిన ప్రభుత్వం అలసత్వం ప్రదర్శిస్తోంది. నాటు వేసిన 25 రోజుల్లో యూరియా చల్లాల్సిన రైతులకు యూరియా కొరత ఏర్పడడంతో పంట నష్టపోయే పరిస్థితులు దాపురించాయి. దీంతో ప్రభుత్వ విధానంపై అన్నదాతలు ఆగ్రహిస్తున్నారు. గురువారం మండలంలోని తుంగపాడు పీఏసీఎస్ పరిధిలోని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ ధర్నాకు దిగారు. హుజూర్‌నగర్-జడ్చర్ల రహదారిపై తుంగపాడు బ్రిడ్జి వద్ద ధర్నా చేపట్టి నిరసన వ్యక్తంచేశారు. మండలంలో 42,500 ఎకరాల వరిసాగు చేపడుతుండగా, ఐదు పీఏసీఎస్‌లు, 46 గ్రామ పంచాయతీలకు చెందిన రైతులకు సమయానుకూలంగా యూరియా అందించడంలో ప్రభుత్వం విఫలమైందని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. తుంగపాడు బ్రిడ్జిపై సుమారు గంటన్నరకు పైగా రైతులు ధర్నా చేయడంతో ఇరువైపులా 3కి.మీ మేర వాహనాలు నిలిచిపోయి ప్రయాణికులు ఇబ్బందులకు గురయ్యారు. రూరల్ పోలీసులు, వ్యవసాయాధికారులు అక్కడికి చేరుకొని రైతులకు యూరియా అందేలా చర్యలు తీసుకుంటామని హామి ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు.

రామన్నపేటలో రాస్తారోకో

రామన్నపేట, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రామన్నపేట మండల కేంద్రంలోని సింగిల్ విండో కార్యాలయం ఎదుట యూరియా అందించాలని రైతులు గంటపాటు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ వ్యవసాయ అధికారులు ఎరువుల షాపు డీలర్లతో కుమ్మక్కై యూరియాను బ్లాక్ మార్కెట్‌లో విక్రయిస్తూ రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. వచ్చిన అరకొర యూరియాను ఆసరాగా చేసుకొని ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తున్నారని ఆరోపించారు. స్థానిక సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ నాగరాజు నచ్చజెప్పడంతో రాస్తారోకో విరమింపజేశారు. రైతులకు మద్దతుగా పలు పార్టీల నేతలు రాస్తారోకోలో పాల్గొన్నారు.



ఆలేరులో యూరియా కోసం క్యూలైన్‌లో నిలిచిన రైతులు




రామన్నపేటలో రైతుల ఆందోళన



మిర్యాలగూడ మండలం తుంగపాడు బ్రిడ్జి వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

మూడు రోజులుగా మూతబడి



మోటకొండూరు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మోటకొండూరు మండలంలో యూరియా కొరత రైతులను వేధిస్తోంది. యూరియా లేకపోవడంతో మూడు రోజులుగా ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం కార్యాలయం మూతపడింది. ఒక్క ఆధార్ కార్డుకు రెండు బ్యాగుల యూరియా ఇవ్వడంతో రైతులకు తిప్పలు తప్పడంలేదు. ఇటీవల కురిసిన వర్షాలకు వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. కానీ పత్తి, వరిసాగుకు సరిపడా యూరియా అవసరం ఉండగా, రైతులు పొలం పనులను వదిలి యూరియాకోసం పీఏసీఎస్ కేంద్రాల వద్ద బారులు తీరుతూ పడరాని పాట్లు పడుతున్నారు. అధికారులు స్పందించి యూరియాను అందించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

బావిలో పడి వృద్ధుడి మృతి




నర్సింహ(ఫైల్)

ఆత్మకూరు(ఎం), సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండలం రామవాపురం గ్రామంలో వ్యవసాయ బావిలో పడి వృద్ధుడు మృతి చెందాడు. గురువారం ఈ ఘటన జరిగింది. బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. వలిగొండ మండలం చిత్తాపురం గ్రామానికి చెందిన ఏటెల్లి నర్సింహ(75)కు మతిస్థిమితం సరిగా లేకపోవడంతో ఐదు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయాడు. అతనికోసం చుట్టుపక్కల గ్రామాల్లో వెతికినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో వలిగొండ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆత్మకూరు(ఎం) మండలం రాఘవాపురం గ్రామంలో ఓ వ్యవసాయ బావిలో మృతదేహం కన్పించింది. వెంటనే పోలీసులకు స్థానికులు సమాచారం ఇచ్చారు. విషయం తెలుసుకున్న నర్సింహ కుటుంబ సభ్యులు సంఘటనా స్థలానికి చేరుకొని బావిలో ఉన్న మృతదేహాన్ని బయటకు తీశారు.

మనస్తాపంతో ఆత్మహత్య..

గుండాల, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన తాళ్లపల్లి రాములు(75) మనస్తాపంతో బుధవారంరాత్రి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల వివరాల ప్రకారం.. రాములుకు 3.24 ఎకరాల భూమి ఉంది. ఇందులో పిల్లల పేరున మూడు ఎకరాలు రిజిస్ట్రేషన్ చేయగా, మిగతా 24 గుంటల విషయంలో కొంతకాలంగా తగాదాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో మనస్తాపం చెందిన రాములు ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుమారుడు శ్రీను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తేజం రెడ్డి తెలిపారు.

బంగారు ఆభరణాల రికవరీ



రికవరీ చేసిన ఆభరణాలు

భువనగిరి టౌన్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): తుర్కపల్లి మండలం మాదారం గ్రామానికి చెందిన పగిడిపల్లి అనిత ఈ నెల 3న భువనగిరిలో ఎనిమిది తులాల బంగారు ఆభరణాలు, రూ.20వేలు భద్రపరిచిన బ్యాగును ఆటోలోనే మరిచిపోయింది. కొద్దిసేపటికి గ్రహించుకున్న ఆమె అదేరోజు పట్టణ పోలీసులకు ఫిర్యాదుచేశారు. దీంతో భువనగిరి ఇన్‌స్పెక్టర్ రమేష్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. ఆమె ప్రయాణించిన ఆటోను గుర్తించి డ్రైవర్‌ను విచారించారు. ఈక్రమంలో ఆమె ప్రయాణించిన తర్వాత అదే ఆటోలో వెళ్లిన మరో ప్రయాణికుడు ఆటో డ్రైవర్‌కు ఫోన్‌పే ద్వారా కిరాయి చెల్లించాడు. ఈ మేరకు ఫోన్‌పే నెంబర్ ఆధారంగా అతడిని పోలీస్‌స్టేషన్‌కు రప్పించి విచారించగా, ఆటోలో దొరికిన బ్యాగును పోలీసులకు ఇచ్చాడు. ఈమేరకు పోలీసులు అనిత దంపతులకు గురువారం ఆటోలో పోగొట్టుకున్న బ్యాగును అందజేశారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ రమేష్, ఎస్ఐలు లక్ష్మీనారాయణ, లక్ష్మీనర్సయ్య పాల్గొన్నారు.

24 పీఏసీఎస్ ఛైర్మన్లకు బాధ్యతలు

● మరికొన్ని సొసైటీలపై నిర్ణయం పెండింగ్

నల్లగొండ, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లాలోని 24 ప్రాథమిక సహకార సంఘాల చైర్మన్లకు తిరిగి బాధ్యతలు అప్పగిస్తూ జిల్లా సహకార అధికారి ఉత్తర్వులు జారీ చేసినట్లు సమాచారం. అదేవిధంగా మరో 14 సొసైటీలపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ఆ సొసైటీలకు స్పెషల్ ఆఫీసర్లు నియమిస్తారా? లేదంటే చైర్మన్లకు బాధ్యతలు అప్పగిస్తారా? అనేది మరో వారం రోజుల్లో తేలనుంది. దీంతోపాటు ఇంకో ఐదు సొసైటీలపై కూడా ఎటూ తేల్చుకోలేదు.

హమ్మయ్య!

● జీఎస్టీ తగ్గింపుతో తగ్గిన భారం



కేంద్రప్రభుత్వం జీఎస్టీ తగ్గింపునకు తీసుకున్న నిర్ణయం అన్నివర్గాల ప్రజల్లో ఆనందాన్ని నింపింది. ప్రస్తుతం నాలుగు స్లాబ్‌లలో అమలవుతున్న 5శాతం, 12శాతం, 18శాతం, 28శాతం స్థానంలో జీఎస్టీని తగ్గిస్తూ రెండు స్లాబ్‌లలో 5, 18శాతం అమలు చేయనున్నారు.

(ఆంధ్రజ్యోతి-కోదాడ)

తగ్గించిన జీఎస్టీ ఈ నెల 22నుంచి అమలులోకి వస్తుందని కేంద్ర ఆర్థిక మంత్రి చెప్పటంతో కొనుగోలు భారం తగ్గనుందని మధ్య తరగతి ప్రజలు ఊరట చెందుతున్నారు. వ్యాపారులు సైతం విక్రయాలు పెరుగుతాయని ఆశాభావం వ్యక్తంచేస్తున్నారు. ఇదిలా ఉంటే జీఎస్టీ తగ్గింపుతో కొత్తగా లారీ కొనుగోలు చేసే యాజమానికి రూ.5లక్షలు, ద్విచక్ర వాహనదారుడికి రూ.6వేల నుంచి రూ.17వేలు, పాఠశాల విద్యార్థులకు రూ.240, జీవిత బీమాపాలసీదారులకు రూ.2,125 భారం తగ్గనుంది. విద్యార్థులు కొనుగోలు చేసే నోట్, వర్క్‌బుక్స్, పెన్సిళ్లు, షార్ప్‌నర్‌లు, కంబాక్స్‌లపై జీఎస్టీ ఎత్తివేయటంతో తల్లిదండ్రులు ఆనందపడుతున్నారు. జీవిత బీమా ప్రీమియంపై జీఎస్టీ ఎత్తివేతతో బీమాదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రైతులు వినియోగించే ట్రాక్టర్, విడిభాగాలు, టైర్లపై జీఎస్టీని 18శాతం నుంచి 5శాతానికి తగ్గించటంపై వ్యవసాయానికి మంచి రోజులు వచ్చినట్లేనంటున్నారు. ఏసీలు, టీవీలు, వాషింగ్‌మెషిన్లపై జీఎస్టీ 18 శాతం, తలనూనెలు, షాంపూలు, టూత్‌పేస్టులు, బ్రష్‌లు, సబ్బులతోపాటు, మెడికల్ సామగ్రిపై పన్ను భారాన్ని 5శాతానికి తగ్గించటంపై గృహిణులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ట్రాన్స్‌పోర్ట్ లారీ యజమానులకు తగ్గనున్న భారం

ట్రాన్స్‌పోర్ట్ లారీ యజమానులు సంవత్సరంలో 10 కొత్త లారీలు తీసుకుంటారు. 16 టైర్ల లారీకి 28శాతం జీఎస్టీతో కలిపి రూ.54లక్షలు అవుతుంది. కేంద్రం జీఎస్టీ 28శాతం నుంచి 18శాతానికి తగ్గించటంతో లారీపై సుమారు రూ.5లక్షలు తగ్గనుంది. ఆ చొప్పున 10 లారీలపై రూ.50లక్షల భారం తగ్గనుందని లారీ యజమానులు చెబుతున్నారు. జీఎస్టీ తగ్గించకముందు చెల్లించే రూ.5లక్షలపై ఫైనాన్స్ సంస్థలకు ఫైనాన్స్ గడువుకాలం (ఐదేళ్ల)లో మరో రూ.2లక్షలు చెల్లించాల్సి ఉండేద ని, జీఎస్టీ తగ్గింపుతో లారీపై రూ.5లక్షలు, ఫైనాన్స్ చెల్లించే రూ.2లక్షలు మొత్తంగా రూ.ఏడు లక్షలు ఒక్కో లారీపై ఆదా అవుతాయని పేర్కొంటున్నారు. జీఎస్టీ తగ్గింపుతో భారీ ఊరట లభించినట్లయిందంటున్నారు.

ద్విచక్రవాహనదారులకు..



సూర్యాపేట జిల్లాలో ద్విచక్రవాహనాల కంపెనీలు సుమారు 80పైగా ఉన్నట్లు సమాచారం. ఒక్కో దుకాణంలో నెలకు 50 వాహనాలు విక్రయిస్తున్నారు. ఒక్కో ద్విచక్రవాహనం ఖరీదు రూ.70వేల నుంచి రూ.1.70లక్షలు ఉంటుందని వ్యాపారులు చెప్తున్నారు. కాగా రూ.70వేల వాహనానికి తగ్గిన జీఎస్టీ ప్రకారం రూ.7వేలు, రూ.1.70లక్షల వాహనంపై రూ.17వేలు తగ్గుతుందని పేర్కొంటున్నారు. ఫలితంగా వినియోగదారులు వాహనాల కొనుగోలుకు ఆసక్తి చూపుతారని చెప్తున్నారు.

బీమా ప్రీమియం పాలసీదారులపై..

బీమా ప్రీమియంపై కేంద్రం జీఎస్టీ పూర్తిగా ఎత్తివేయటంతో పాలసీదారులపై రూ.లక్షపై రూ.2,125 భారం తగ్గనుంది. ప్రస్తుతం పాలసీదారుడు రూ.20లక్షల పాలసీ తీసుకుంటే, సుమారు రూ.లక్ష ప్రీమియం చెల్లిస్తే, దానిపై 2.12శాతం జీఎస్టీ చొప్పున అదనంగా మరో రూ2,125తో కలిపి రూ.1,02,125 చెల్లించాల్సి వచ్చేది. బీమా పాలసీపై జీఎస్టీ ఎత్తివేయటంతో పాలసీదారుడిపై అదనపు భారం తగ్గనుంది. దీంతో బీమా పాలసీదారులు, ఏజెంట్లు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అదే విధంగా బడ్జెట్ (మధ్యతరగతి) పాఠశాలలో చదివే విద్యార్థులు సంవత్సరంలో నోట్, వర్క్‌బుక్స్ పెన్సిళ్లు, కంపాక్స్‌లపై సుమారు రూ.2వేల వరకు ఖర్చు చేస్తారు. కేంద్రం విద్యార్థులు వాడే నోట్ బుక్స్‌తోపాటు ఇతర పరికరాలపై జీఎస్టీ 12శాతం వేయటంతో రూ.240 అదనంగా ఖర్చు చేయాల్సి వచ్చేది. ప్రస్తుతం జీఎస్టీ ఎత్తివేస్తామని ప్రకటించటంతో విద్యార్థుల తల్లిదండ్రులకు ఆమేరకు ఖర్చు తగ్గినట్లేనని విద్యా నిపుణులు చెప్తున్నారు. కార్పొరేట్ స్కూల్ చదివే విద్యార్థులకు మరింత ఆదా కానుందని పేర్కొంటున్నారు.

ట్రాక్టర్లపై జీఎస్టీ తగ్గింపుతో..



ట్రాక్టర్లు, వాటి విడిభాగాలు, టైర్లపై జీఎస్టీ 12శాతం, 18శాతం నుంచి 5శాతం తగ్గించటంపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. టైర్లు జత రూ.50వేలు ఉంటే 18 శాతం జీఎస్టీ చొప్పున రూ.9వేలు ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంటుంది. జీఎస్టీ 5శాతానికి తగ్గించటంతో రూ.2,500 భారం మాత్రమే పడుతుంది. దీంతో రైతుకు రూ.6,500 మిగులుతుంది. జీఎస్టీ తగ్గింపుతో రైతులపై భారం తగ్గినట్లేనని రైతులు పేర్కొంటున్నారు. అదేవిధంగా కార్లు, ఏసీలు, టీవీలు, వాషింగ్ మెషీన్లు, తల నూనెలు, షాంపూలు, టూత్ పేస్టులు, బ్రష్‌లు, షేవింగ్ క్రీములు, సబ్బులపై జీఎస్టీ తగ్గింపుపై అన్ని వర్గాల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

కేంద్రం నిర్ణయంతో భారం తగ్గినట్లే



లారీల కొనుగోలుపై జీఎస్టీ 28 శాతం నుంచి 18 శాతం తగ్గించటంతో ఒక్కో లారీ కొనుగోలుపై రూ.5లక్షల వరకు మిగులుతుంది. 10 లారీలు తీసుకుంటే 11వ లారీ ఖర్చు లేకుండా వస్తున్నట్లే. అంతేకాక రూ.ఐదు లక్షలపై ఫైనాన్స్ కంపెనీలకు ఐదేళ్లలో రూ.2లక్షల వడ్డీ కడతాం. ఆ చొప్పున 10 లారీలపై మరో రూ.20లక్షలు ఆదా అవుతుంది. మొత్తంగా రూ.70లక్షల వరకు జీఎస్టీ తగ్గింపుతో ఆదా అవుతుంది. జీఎస్టీ తగ్గింపు రవాణా రంగానికి కలిసొచ్చినట్లయింది.

కనగాల నాగేశ్వరరావు, ఏఎంసీ సభ్యుడు, కోదాడ

సైబర్ నేరగాడి బురిడీ

రాజాపేట, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాజాపేట మండలం పాముకుంటలో సైబర్ నేరగాళ్ల వలలో పడి వ్యక్తి డబ్బులు పోగొట్టుకున్న ఘటన గురువారం జరిగింది. బాధితుడు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని పాముకుంట గ్రామానికి చెందిన మొలుగు సోమలింగంకు గురువారం సుబ్బారావు అనే పేరుతో బ్యాంక్‌నుంచి ఫోన్ చేస్తున్నానని చెప్పాడు. మీకు మూడేళ్లుగా ఫోన్‌పేనుంచి నెలకు రూ.350 రావాల్సి ఉందని తెలిపారు. ఫోన్ పెట్టేయకుండా మీకు వచ్చే నెంబర్లు తెలపాలని నేరగాడు నమ్మబలికాడు. నమ్మిన బాధితుడు ఫోనుకు వచ్చిన నెంబర్ (ఓటీపీ) తెలపడంతో మొదటిసారి రూ.18,916, రెండోసారి రూ.16,812 ఫోన్‌పే ఖాతానుంచి డ్రా అయ్యాయి. మరోసారి నెంబర్లు చెప్పమనడంతో బాధితునికి అనుమానం వచ్చి చూడగా రూ.35,728లు నేరగాళ్లు కాజేసినట్లు గుర్తించి రాజాపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

మోటార్ల దొంగలకు రిమాండ్

మఠంపల్లి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలంలో వ్యవసాయ మోటార్లను దొంగలిస్తున్న వ్యక్తులను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ పి.బాబు అన్నారు. చోరీకి పాల్పడుతున్న నిందితుల వివరాలను గురువారం వెల్లడించారు. మండలంలోని యాతవాకిళ్ల గ్రామానికి చెందిన పులి రాంబాబు మోటరు రిపేర్ రావడంతో గ్రామ సమీపంలోని మెకానిక్‌కు ఇచ్చాడు. అయితే దుకాణం ముందు ఉంచిన మోటార్‌ను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. దీంతో యజమాని ఆగస్టు 30న పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తుండగా.. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలం బొత్తలపాలెం గ్రామ పరిధిలోని సంతోష్‌నగర్‌కు చెందిన మెరుగు జగదీష్ ముదిరాజ్, ఈదులగూడేనికి చెందిన గొర్రెల సాయి, శ్రీరామ్‌లు కారులో అనుమానాస్పదంగా కన్పించారు. పోలీసులు కారును తనిఖీ చేయగా అందులో మోటార్, కొన్ని వస్తువులు లభ్యమయ్యాయి. వారిని అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించి విచారించగా యాతవాకిళ్ల, కల్మల్‌చెరువు గ్రామాల్లో వ్యవసాయ మోటార్లను దొంగలించినట్లు ఒప్పుకున్నారు. వారి నుంచి ఆరు మోటర్లు, రెండు డంబెళ్లు, కారును స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు పంపినట్లు ఎస్ఐ బాబు తెలిపారు. ఈ తనిఖీలో ఏఎస్ఐ శంకర్‌నాయక్, పోలీస్ సిబ్బంది శ్రీనివాస్‌నాయక్, కృష్ణ, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

గురువు.. మార్గదర్శకుడు



» వినూత్న రీతిలో విద్యా బోధన
» విద్యార్థులను తీర్చిదిద్దే అలుపెగని శ్రామికులు

సమాజంలో వివిధ వృత్తులను విద్యార్థులకు ప్రత్యక్ష బోధన చేస్తున్న ఉపాధ్యాయుడు ప్రభాకర్

సూర్యాపేట అర్బన్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లాకేంద్రానికి చెందిన రాచకొండ ప్రభాకర్ 2008 డీఎస్సీలో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. ప్రస్తుతం మద్దిరాల మండలం గోరింట్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. విద్యార్థులకు తరగతి గదిలో నేర్పిన విద్యతో పాటు ప్రత్యక్షంగా పాఠ్యాంశంలోని భావాన్ని అర్థం అయ్యేలా అవగాహన కల్పిస్తున్నారు. గ్రామీణ నేపథ్యం, వృత్తుల ప్రాముఖ్యతపై విద్యార్థులకు వివరిస్తుంటారు. కుమ్మరి వృత్తివారు తమ వృత్తుల్లో భాగంగా కుండలు చేసే విధానాన్ని ప్రత్యక్ష బోధనలో భాగంగా విద్యార్థులకు కుండలు చేసే ప్రదేశానికి తీసుకెళ్లి అవగాహన కల్పిస్తారు. చేనేత, రజక, మంగలి, చెప్పులు కుట్టే వృత్తిదారుల వద్దకు తీసుకెళ్లి అవగాహన కల్పిస్తుంటారు. మాదక ద్రవ్యాలు వాడితే కలిగే అనార్థాలను విద్యార్థులకు వివరిస్తుంటారు. సెలవు దినాల్లో ప్రజలు అధికంగా ఉన్న చోట నల్లదుస్తులు వేసుకొని మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని అవగాహన కల్పిస్తున్నారు.



డ్రగ్స్ నిర్మూలనే ధ్యేయం

డ్రగ్స్ నిర్మూలనే ధ్యేయంగా సంవత్సర కాలంగా సెలవు దినాల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నా. విద్యార్థులకు ప్రత్యక్ష బోధనతో ఎంతో మేలు కలుగుతుంది. విద్యార్థులకు మెరుగైన విద్యను అందిచేలా కృషి చేస్తున్నా. విద్యార్థుల జీవితం ఉపాధ్యాయుడి చేతుల్లోనే ఉంది.

- రాచకొండ ప్రభాకర్, ఉపాధ్యాయుడు

విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపడం ఒక్క గురువుకే సాధ్యం. విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చి దిద్ది దేశ భవిష్యత్‌ను మార్చే శక్తి ఉపాధ్యాయులకు ఉంది. సమాజంలో మార్పు తేవాలని కొందరు ఉపాధ్యాయులు తమదైన శైలిలో విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్నారు. సమాజాన్నీ చైతన్య పరుస్తూ ముందుకు సాగుతున్నారు. సమాజంలో ఉన్న చెడును పారదోలే సమాజిక కార్యకర్తలుగా కూడా తోడ్పతున్నారు. ప్రతివ్యక్తి జీవితంలో తల్లిదండ్రుల తర్వాత గురువులే ప్రధాన పాత్రను పోషిస్తారు. వారికి మంచి చెడులు చెబుతూ తీర్చిదిద్దుతారు. నేడు ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' కథనాలు.

ప్రైవేట్ నుంచి సర్కార్ బడికి మళ్లించి..

రాజాపేట, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా రాజాపేట మండలం సింగారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లెక్కల రవీందర్‌రెడ్డి పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తున్నారు. బదిలీపై ఆయన పాఠశాలకు వచ్చిన సమయంలో విద్యార్థుల సంఖ్యపూర్తిగా తగ్గిపోయింది. దీంతో ఆయన విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ఆలోచించారు. ప్రైవేట్ పాఠశాలలకు పంపుతున్న విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రభుత్వ బడిపై నమ్మకం కలిగించారు. ప్రైవేట్ పాఠశాలలకు వెళ్లే 16మంది విద్యార్థులను తమ పాఠశాలలో చేర్పించారు. నాణ్యమైన విద్యను అందించడంతో పాటు మౌలిక వసతుల కల్పనకు కృషి చేశారు. పాఠశాలలోని 63మంది విద్యార్థులకు టై, బెల్ట్, షూస్‌ను సొంత డబ్బులతో అందజేశారు. విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు ముఖ్యమని రూ.లక్ష ఖర్చు చేయించి ఆట స్థలాన్ని పూర్తిగా చదును చేయించారు. పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తున్న రవీందర్‌రెడ్డిని గ్రామస్థులు అభినందిస్తున్నారు.



ప్రధానోపాధ్యాయులు రవీందర్ రెడ్డి

దాతల సహకారం.. వినూత్న ఆలోచన.

చౌటుప్పల్ టౌన్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణంలోని బీసీ కాలనీ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు కంచర్ల హర్షవర్ధన్‌రెడ్డి విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నారు. మండలంలోని తాళ్ల సింగారం నుంచి 2024 జూలైలో బదిలీపై ఈ పాఠశాలకు వచ్చిన ఆయన ఆరు మాసాల పాటు ఇన్‌చార్జి హెచ్‌ఎంగా పనిచేశారు. ఆ సమయంలో అనేక కార్యక్రమాలు చేపట్టి విద్యార్థుల సంఖ్యను 125కు పెంచారు. ప్రైవేట్ పాఠశాలల నుంచి విద్యార్థులు టీసీ తీసుకొని ఈ పాఠశాలలో ప్రవేశాలు తీసుకున్నారు. దాతల సహకారంతో రూ.లక్ష విలువైన మైక్‌సెట్, టేబుల్స్, ఇతర ఫర్నిచర్, విద్యార్థులకు టై, ఐడీకార్డులు సమకూర్చారు. ఒక ప్రైవేట్ టీచర్‌ను నియమించారు. విద్యార్థులకు అక్షర మాలలు సులభంగా అర్థమయ్యేందుకు సొంతంగా రూ.10 వేలు వెచ్చించి ఫ్లెక్సీ చార్ట్‌లను ఏర్పాటు చేయించారు. పాఠశాలకు గైర్హాజరయ్యే విద్యార్థుల సమాచారాన్ని తల్లిదండ్రులకు అందించి వాస్తవాలను తెలుసుకునే వారు. విద్యార్థుల ఇళ్లకు వెళ్లి విద్య ప్రాముఖ్యతపై వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తుంటారు. 2023లో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డు అందుకున్నారు.



కంచర్ల హర్షవర్ధన్ రెడ్డి

వినూత్న ఆలోచనతో జాతీయ అవార్డు..

ఢిల్లీలో రాష్ట్రపతి నుంచి అవార్డు అందుకోనున్న మారం పవిత్ర



జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మారం పవిత్ర

పెన్‌పహాడ్ సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జీవశాస్త్రం ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న మారం పవిత్ర శుక్రవారం ఢిల్లీలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నుంచి జాతీయ ఉత్తమ ఉపాధ్యాయురాలిగా అవార్డు అందుకోనున్నారు. జీవశాస్త్రంలో ఆమె బోధన వినూత్నంగా ఉంటుందని విద్యార్థులు తెలిపా రు. ప్రతి పాఠ్యాంశాన్నీ విద్యార్థులకు కళ్లకు కట్టినట్లు వివరిస్తారు. ప్రయోగాల్లో సాంకేతికతను వినియోగిస్తారు. విద్యార్థులు శ్రద్ధగా వినడంతో పాటు ప్రయోగాలు చేసేందుకు ఇష్టపడుతున్నారు.

సాధించిన విజయాలు

- సీఐఈటీఎన్‌ఐఆర్‌టీ యూట్యూబ్ ఛానెల్ ద్వారా 2020-2021లో ఉపాధ్యాయులకు ఉపయోగపడే టూల్స్‌పై అవగాహన కల్పించారు.
- 2019లో విద్యావిధానాలపై జాతీయ స్థాయిలో సెమినార్ త్రుహాండ్స్ ఆన్ ఎక్స్‌పీరియన్స్ అనే అంశంపై ప్రసంగించారు.
- 2017 నుంచి ఇప్పటి వరకు స్టేట్ ఇనిస్టూటివ్ ఆఫ్ టెక్నాలజి ద్వారా జీవశాస్త్రంలో 14 డిజిటల్ పాఠాలను బోధించారు.

అందుకున్న అవార్డులు

- 2019లో అక్షర ఫౌండేషన్ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు
- 2021లో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు
- 2023లో నేషనల్ సైన్స్ డే రాష్ట్రస్థాయి అవార్డు
- 2023-24లో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు
- 2025లో జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు

తల్లిదండ్రులను ఒప్పించి పాఠశాల వైపు..



పాఠశాల గదిలో బొమ్మకు తెలుగు అచ్చులు, హల్లులు వేసి విద్యార్థులకు బోధిస్తున్న ఉపాధ్యాయుడు వెంకటేశ్వర్లు

మర్రిగూడ, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలంలోని సరంపేట గ్రామానికి చెందిన లేంకలపల్లి వెంకటేశ్వర్లు మండలంలోని రాంరెడ్డి పల్లి గ్రామంలో ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. విద్యార్థులకు సులభమైన రీతిలో క్రీడా పద్ధతిలో, నాటకీకరణ ద్వారా, కృతధార పద్ధతిలో బోధనలు చేస్తున్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా ఆ పాఠశాల ఉపాధ్యాయులతో కలిసి పిల్లలను బడికి పంపించకుండా ఇంటి వద్దనే ఉంచుకుంటున్న వ్యవసాయ రైతుల వద్దకు వెళ్లి మీ పిల్లలను బడికి పంపించాలంటూ వ్యవసాయ పొలాలపనుల వద్దకు వెళ్లి చదువుపై అవగాహన కల్పించి తల్లిదండ్రులను ఒప్పించి పిల్లలను బడికి వచ్చే విధంగా చేశారు. ఇన్నోవేటివ్ కార్యక్రమాలు ద్వారా చదువు చెబుతారు. సేవలను గుర్తించి వేదాస్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర తరపున తెలంగాణ సిద్ధాంత కర్త ప్రొఫెసర్ జయశంకర్ సార్ పేరు మీద హైదరాబాదులో రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్నారు.

రీల్స్‌తో సులభతర బోధన



మోత్కూరు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మండలం పొలడుగు ప్రాథమికోన్నత పాఠశాల హెచ్‌ఎం వై. కమలాకర్‌రెడ్డి సులభ పద్ధతుల్లో బోధన చేస్తుంటారు. 1992 నుంచి 1996 వరకు చదువు-వెలుగు కళాబృందంలో కళాకారుడిగా పనిచేశారు. 1996 నుంచి ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. వివిధ ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయుడిగా పనిచేసిన ఆయన ఏడాదిగా పొలడుగు ప్రాథమికోన్నత పాఠశాల హెచ్‌ఎంగా పని చేస్తున్నారు. బడిబాట సందర్భంగా పిల్లలను, వారి తల్లిదండ్రులను ఆకట్టుకునేలా స్వయంగా పాటలు రాసి, సంగీతం సమకూర్చుకుని పాడి వీడియోలు తీసి టీచర్లు, విద్యార్థుల తల్లిదండ్రులు ఉన్న గ్రూపుల్లో అప్‌లోడ్ చేస్తారు. ఇప్పటి వరకు సుమారు 40పాటలు రాసి, వీడియోలు చేసి యూట్యూబ్‌లో, ఇతర గ్రూపుల్లో అప్‌లోడ్ చేశారు. టీఎల్‌ఎంలో విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే రీతిలో, విద్యార్థులకు ఆటపాటల ద్వారా విద్యాబోధన చేసే వీడియోలు చేసి గ్రూపుల్లో అప్‌లోడ్ చేసి ఉపాధ్యాయులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. కరోనా సమయంలో కూడా విద్యార్థులకు ఉపయోగపడేలా పలు పాఠ్యాంశాలపై వీడియోలు చేశారు. ఆయన వీడియోలను కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో దీక్ష పోర్టల్ లోనూ అప్‌లోడ్ చేసింది. మద్యపానానికి అలవాటు పడిన కుటుంబాలు ఎలా దెబ్బతింటాయి, వారి పిల్లలు ఎలా తయారువుతున్నారు. లాంటి సామాజిక అంశాలపై రీల్స్ చేసి అప్‌లోడ్ చేశారు.

1999లో అప్పటి సీఎం చంద్రబాబు నుంచి, 2013లో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు, 2023లో నిర్వహించిన తెలంగాణ దశాబ్ధి ఉత్సవాల్లో జిల్లా స్థాయి బెస్ట్ ప్రాక్టిషనర్‌గా అవార్డు అందుకున్నారు. తీరిక సమయాల్లో రవీంద్రభారతి, త్యాగరాయ గానసభల్లో సాంస్కృతిక ప్రదర్శనలు ఇస్తుంటారు. పీఎంశ్రీలో పొలడుగు పాఠశాలలో ఏర్పాటు చేసిన కిచెన్ గార్డెన్‌ను మొక్కుబడిగా కాకుండా, కోతుల బెడద లేకుండా చుట్టూ, పైన ఐరన్ జాలితో ఫెన్సింగ్ చేయించారు. అందులో 14 రకాల కూరగాయలు, ఆకుకూరలు పండించి మధ్యాహ్న భోజనంలో విద్యార్థులకు వండి పెడుతున్నారు.

సారథి పరివార్ డిజిటల్ సేవలు షురూ

» సారథితో వాహన సేవలు సులువు » డ్రైవింగ్ లైసెన్స్ సేవలు సులభతరం » ఎంవీఐ కార్యాలయానికి వెళ్లకుండానే సులభంగా

వాహన రిజిస్ట్రేషన్, పర్మిట్, పన్ను విధింపు. ఫిట్‌నెస్, మోటార్ డ్రైవింగ్ స్కూల్స్, లెర్నర్ లైసెన్స్, డ్రైవింగ్ లైసెన్స్ తదితర సేవలను పరివాహన్ పోర్టల్ ద్వారా కేంద్ర ప్రభుత్వం వినియోగదారులకు అందుబాటులోకి తెచ్చింది. జాతీయ రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వశాఖ నేతృత్వంలో పోర్టల్‌లోని వాహన్, సారథి అప్లికేషన్‌ల ద్వారా డిజిటల్ సేవలు అందించే ప్రక్రియ కొనసాగుతోంది.

- ఆంధ్రజ్యోతి, మిర్యాలగూడ



పరివాహన్ పోర్టల్ ద్వారా ఆర్‌సీ పొందడం, డ్రైవింగ్ లైసెన్స్ సేవలు పొందడం, ట్రాఫిక్ ఉల్లంఘనలకు సంబంధించిన చలాన్లు చెల్లించేందుకు కల్పించింది. 2006లో జాతీయ ఈ -గవర్నెన్ ప్రోగ్రాం కింద దీనిని చేపట్టినప్పటికీ నల్లగొండ జిల్లాలో ఇటీవలే సారథి అప్లికేషన్‌ను అమలు చేస్తుండగా, సాంకేతిక కారణాలతో 'వాహన్' పూర్తి స్థాయిలో అమలుకావడం లేదు.

పరివాహన్ పోర్టల్‌తో డిజిటల్ సేవలు

ఏకీకృత జాతీయ రవాణా వ్యవస్థలో భాగంగా చేపట్టిన పరివాహన్ ద్వారా వాహన యజమానులకు, డ్రైవర్లకు సులభంగా సేవలు పొందవచ్చు. పరివాహన్ పోర్టల్ లోని సారథి, వాహన్ అప్లికేషన్స్ ద్వారా డ్రైవింగ్ లైసెన్స్ వివరాలు, వాహన వివరాలు, రిజిస్ట్రేషన్స్ సమాచారం, అనుమతులకు సంబంధించిన సమాచార సేవలతో పాటువాహన సంబంధిత సేవలు, డ్రైవింగ్ లైసెన్స్, ట్యాక్స్ తనిఖీ, ఫ్యాన్సీ నంబర్ బుకింగ్, నేషనల్ రిజిస్టర్ సేవలు, హోమోలోగేషన్, జాతీయ పర్మిట్, ఆలిండియా టూరిస్ట్ పర్మిట్, సీఎన్‌జీ తయారీదారు, వేగపరిమితి పరికరం తయారీదారు, ట్రేడ్ సర్టిఫికెట్ తదితర ఆన్‌లైన్ సేవలు పొందే అవకాశం కల్పించినట్లు రవాణా శాఖ అధికారులు తెలిపారు. ఉపాధి కోసం, వివిధ కారణాల రీత్యా బయట రాష్ట్రాలకు వెళ్లినవారు, ఇతర రాష్ట్రాల నుంచి మన రాష్ట్రంలోకి వచ్చినవారు ఈ పోర్టల్ ద్వారా డ్రైవింగ్ లైసెన్స్, చిరునామా మార్పులు, చేర్పులు, లైసెన్స బదిలీ లాంటి సేవలను సులభంగా పొందవచ్చు.

'సారథి'తో వేగవంతమైన సమాచారం

ప్రభుత్వం రెండో విడతలో నల్లగొండ జిల్లాలో సారథి అప్లికేషన్ ద్వారా సేవలు పొందేందు కు అవకాశం కల్పించింది. గత నెల ఆగస్టు 25 నుంచి నల్లగొండ, మిర్యాలగూడ రవాణాశాఖ కార్యాలయాలతో పాటు రాష్ట్రంలోని మరో 10కార్యాలయాల్లో సారథి సాఫ్ట్‌వేర్‌ను వినియోగించాలని ఆదేశించారు. గతంలో స్టేట్ పోర్టల్ సీఎఫ్‌ఎస్‌టీ సాంకేతికతకు బదులుగా నేషనల్ ఇన్ఫర్‌మేటిక్స్ సెంటర్(ఎన్‌ఐసీ) సాఫ్ట్‌వేర్‌ను వినియోగించాలని సూచించింది. దీనిద్వారా ఆర్‌టీవోల పని వాతావరణాన్ని మెరుగుపరచడం, పౌరులకు మెరుగైన సేవలు అందించడం, ఇతర ప్రభుత్వ విభాగాలకు డ్రైవింగ్ లైసెన్స్, వాహన సమాచారాన్ని త్వరగా చేరవేయడం చేయడానికి వీలువుతుందని అధికారులు అభిప్రాయపడుతున్నారు. సారథి డ్రైవింగ్ లైసెన్స్‌ల సమాచారం పొందేందుకు లెర్నింగ్, డ్రైవింగ్ లైసెన్స్, రెన్యువల్‌ను ఎంవీఐ కార్యాలయానికి వెళ్లకుండానే పోర్టల్ ద్వారా పొందే ఉంటుంది. పేపర్ వాడకాన్ని తగ్గిస్తూ, వేగవంతమైన అప్‌డేట్‌లతో పాటు డిజిటల్ యాక్సెస్ ద్వారా పారదర్శకతను పెంచడం చేస్తుందని అంటున్నారు. స్లాట్‌లను బుక్ చేసుకోవడానికి, ట్యాక్స్‌లను ఆన్‌లైన్‌లో చెల్లించడానికి వీలు కల్పిస్తుందని పేర్కొంటున్నారు.

అందుబాటులోకి రాని వాహన్ రిజిస్ట్రేషన్లు

ప్రస్తుతం షోరూమ్‌ల్లో కొత్త టూవీలర్, ఫోర్‌వీలర్ వాహనాలకు టెంపరరీ రిజిస్ట్రేషన్లు చేస్తున్నారు. పర్మినెంట్ రిజిస్ట్రేషన్‌కు ఆర్టీవో కార్యాలయాలకు వెళ్లాల్సి ఉంటుంది. ఆర్‌సీకార్డులకోసం రోజుల తరబడి ఎదురుచూడాల్సివస్తుంది. షోరూమ్‌ల్లోనే పర్మినెంట్ రిజిస్ట్రేషన్‌లు చేస్తే వాహనదారులకు వ్యయప్రయాసాలు తప్పుతాయని అంటున్నారు.పరివాహన్ పోర్టల్ డీలర్ల వద్దనే వాహనాల రిజిస్ట్రేషన్స్ చేసుకునే వీలు కల్పిస్తుంది. పలు సాంకేతిక కారణాలతో అమలుకావడం లేదని తెలుస్తోంది.

సారథి సేవలను పూర్తిస్థాయిలో అమలులోకి తేవాలి



లెర్నర్ లైసెన్స్ పొందాలంటే ఆర్టీఓ కార్యాలయానికి వెళ్లి పరీక్ష రాయాల్సివస్తోంది. సారథి సేవలు అమలులోకి వస్తే ఇంటి దగ్గర నుంచే రాసే వీలు కలుగుతుంది. లైసెన్స్‌ల రెన్యువల్ ఆన్‌లైన్ ద్వారానే పూర్తి చేయవచ్చు. ప్రజలకు ఉపయోగపడే సారథి అప్లికేషన్ సేవలను పూర్తి స్థాయిలో అందుబాటులోకి తేవాలి.

- ఎస్. రాంబాబు, మిర్యాలగూడ.

సమయం ఆదా అవుతుంది



డ్రైవింగ్ లైసెన్స్‌ల జారీ, వివరాల్లో మార్పుల కోసం అభ్యర్థన, వివిధ పన్నులు, ట్రాఫిక్ చలాన్‌ల చెల్లింపు లాంటి వాటి కోసం పౌరులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. పోర్టల్ లోని రవాణా కార్యాలయ సేవలు పొందడం ద్వారా సమయాన్ని ప్రజలు ఆదా చేసుకోవచ్చు. ట్రాఫిక్ అధికారులకు వాహనాల సమాచారాన్ని అందించడానికి సహాయపడుతుంది.

- ఎల్. వీరాస్వామి ఎంవీఐ, మిర్యాలగూడ.

సూర్యాపేట జిల్లాకు ఉత్తమ పురస్కారాలు




గడ్డం వెంకన్న, ఛత్రు నాయక్

ఆత్మకూర్(ఎస్), గరిడేపల్లి సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు సూర్యాపేట జిల్లా వాసులు ఎంపికయ్యారు. సెప్టెంబరు 5న గురుపూజోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం గురువారం రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను ప్రకటించింది. ఆ జాబితాలో సూర్యాపేట జిల్లా ఆత్మకూర్(ఎస్) మండల కేంద్రానికి చెందిన డాక్టర్ గడ్డం వెంకన్న, గరిడేపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం, మండల విద్యాధికారి ఛత్రు నాయక్ రాష్ట్ర స్థాయి ఉత్తమ అధ్యాపకులుగా ఎంపికయ్యారు. వెంకన్న 30 ఏళ్లుగా జానపద గిరిజన విజ్ఞాన పీఠంలో వివిధ హోదాల్లో విధులు నిర్వహించారు. ప్రస్తుతం డాక్టర్ గడ్డం వెంకన్న సురవరం ప్రతాపరెడ్డి తెలుగు యూనివర్సిటీలో జానపదం గిరిజన విజ్ఞాన పీఠం విభాగానికి డీన్‌గా కొనసాగుతున్నారు. గరిడేపల్లి మండలవిద్యాధికారి పానుగోతు ఛత్రునాయక్ మిర్యాలగూడ మండలం తక్కెళ్లపాడుతండాలో 1997 యూపీపీఎస్ పల్లివాడలో ఉపాధ్యాయుడిగా ఉద్యోగంలో చేరి, నాటి నుంచి పలు పాఠశాలల్లో ఉపాధ్యాయుడిగా, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులుగా విధులు నిర్వహించారు. గరిడేపల్లి, మఠంపల్లి, పాలకవీడు మండలాల విద్యాధికారిగా బాధ్యతలు చేపట్టి సుదీర్ఘ కాలం విధులు నిర్వర్తిస్తున్నారు. పాఠశాలల్లో సుమారు 6 వేలు పైచిలుకు మొక్కలు నాటించారు. ప్రతి పాఠశాలలో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెంచడంలో విశేష కృషికి జిల్లా స్థాయిలో పలు అవార్డులను అందుకున్నారు. ఉపాధ్యాయులను సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్లడం, ఆకస్మిక సెలవులను తప్ప ఇంతవరకు ఎలాంటి ఇతర సెలవులు వాడుకోలేదని ఆయన తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్ల సమస్యల పరిష్కారానికి టోల్ ఫ్రీ నంబరు

నల్లగొండ రూరల్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇళ్ల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం, టోల్ ఫ్రీ నంబరు 18005995991 ను తీసుకొచ్చిందని జిల్లా గృహ నిర్మాణ శాఖ పీడీ రాజ్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నంబరు సోమవారం నుంచి అందుబాటులోకి రానున్నట్లు పేర్కొన్నారు. అలాగే ఇళ్ల లబ్ధిదారులు ఇంటికి సంబంధించిన బిల్లుల పరిస్థితి, ఇతర వివరాలను తెలుసుకునేందుకు యాప్‌ను రూపొందించినట్లు వివరించారు. లబ్ధిదారులు యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని వారి స్టేటస్‌ను పరిశీలించుకోవచ్చన్నారు. ఫొటో తీసే పంచాయతీ కార్యదర్శులు ఇబ్బందులు సృష్టిస్తే లబ్ధిదారులు అప్‌లోడ్ చేయవచ్చన్నారు. ఇందుకు వారి మొబైల్ నెంబర్‌కు ఓటీపీ వస్తుందని, ఆ నంబర్‌ను ఎంటర్ చేయాల్సి ఉంటుందన్నారు. ఆధార్ తప్పులకు సంబంధించి ఎంపీడీవోను సంప్రదించాలన్నారు.


'ఎన్‌ఐఆర్‌ఎఫ్'లో విజ్ఞాన్ యూనివర్సిటీకి 70వ ర్యాంకు



వివరాలు వెల్లడిస్తున్న వైస్ చాన్స్‌లర్ కల్నల్, ప్రొఫెసర్ నాగభూషణ్

భూదాన్‌పోచంపల్లి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి) : దేశవ్యాప్తంగా ఉన్న విశ్వవిద్యాలయాల్లో విజ్ఞాన్ యూనివర్సిటీకి జాతీయ స్థాయిలో 70వ ర్యాంకు లభించినట్లు యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ కల్నల్, ప్రొఫెసర్ నాగభూషణ్ తెలిపారు. దేశ్‌ముఖి గ్రామ శివారులో విజ్ఞాన్స్ యూనివర్సిటీలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ (ఎంహెచ్‌ఆర్‌డీ) విడుదల చేసిన ఎన్‌ఐఆర్‌ఎఫ్(నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్) జాతీయ స్థాయి ర్యాంకుల్లో ఈ ర్యాంకు లభించినట్లు చెప్పారు. ఇంజనీరింగ్ విభాగంలో సైతం 80వ ర్యాంకు సాధించినట్లు తెలిపారు. టీచింగ్ లెర్నింగ్ రిసోర్సెస్, రీసెర్చ్ అండ్ ప్రొఫెషనల్ ప్రాక్టీస్, గ్రాడ్యుయేషన్ ఔట్‌కమ్స్, ఔట్‌రీచ్ అండ్ ఇంక్లూజివిటీ, పీఆర్ పర్‌ఫెక్షన్ పనితీరును కేంద్రం పరిశీలించి 100 పాయింట్లను స్కోర్ ప్రామాణికంగా ర్యాంకులను కేటాయించిందన్నారు. విజ్ఞాన్స్ యూనివర్సిటీకు ఎన్‌ఐఆర్‌ఎఫ్ ర్యాంకు లభించడం వల్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రైవేట్ ఏజెన్సీల నుంచి గ్రాంట్‌లు అందుతాయన్నారు. అంతేకాకుండా ప్రముఖ బహుళ జాతి కంపెనీలు, వర్సిటీ విద్యార్థులకు ఎక్కువ ఉద్యోగ అవకాశాలను కల్పిస్తాయన్నారు. ఎన్‌ఐఆర్‌ఎఫ్‌లో ఉత్తమ ర్యాంకు సాధించడానికి కృషి చేసిన ఐక్యూఏసీ బృందాలను, విజ్ఞాన్స్ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, వైస్ చైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయలు, వైస్‌చాన్సలర్ కల్నల్, ప్రొఫెసర్ పీ. నాగభూషణ్, సీఈవో డాక్టర్ మేఘన కూరపాటి, రిజిస్ట్రార్ డాక్టర్ పీఎంవీ. రావు అభినందించారు.

యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్యపూజలు



కల్యాణ తంతు నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామి దివ్యక్షేత్రంలో గురువారం నిత్య కైంకర్యాలు గురువారం వైభవంగా నిర్వహించారు. ప్రధానాలయ నైరుతి దిశలో అష్ట భుజి ప్రాకార మండపంలో ఉత్సవమూర్తులను దివ్యమనోహరంగా అలంకరించిన అర్చకులు వేద మంత్ర పఠనాలు, మంగళ వాయిద్యాల నడుమ సేవోత్సవం చేపట్టారు. ఉత్సవమూర్తులను కల్యాణ మండపంలో అధిష్ఠింపజేసి, విష్వక్సేనుడి తొలి పూజలతో కల్యాణతంతు కొనసాగింది. ముందుగా సుదర్శన శతక పఠనంతో హోమం నిర్వహించారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ. 12,36,016 ఆదాయం సమకూరినట్లు ఈవో వెంకట్రావు తెలిపారు.

రూ. 4 కోట్ల విలువైన స్థిరాస్తి అప్పగింత



దస్తావేజులను స్వీకరిస్తున్న ఆలయ ఈవో వెంకట్రావు

హైదరాబాద్ తిలక్‌నగర్‌కు చెందిన ముత్తినేని వెంక టేశ్వర్లు 152 గజాల విస్తీర్ణంలో నిర్మితమైన రూ. 4 కోట్ల విలువైన మూడు అంతస్థుల(జీ ప్లస్ త్రీ) భవనానికి సంబంధించిన పత్రాలు గురువారం అధికారులకు అప్పగించారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని చిక్కడపల్లి రిజిస్ట్రేషన్ కార్యాలయంలో గురువారం ఈవో ఎస్. వెంకట్రావు, అనువంశిక ధర్మకర్త భాస్కరాయణి నరసింహమూర్తికి సంబంధిత పత్రాలను దాత అందజేశారు. అనంతరం స్వామివారి శేషవస్త్రం కప్పి, లడ్డూ ప్రసాదం దాతకు అందజేశారు.

జీఎస్టీ తగ్గింపుపై హర్షం

చిట్యాలరూరల్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): సామాన్యులపై భారం పడకుండా ఉండేందుకు కేంద్రప్రభుత్వం జీఎస్టీని తగ్గించేందుకు నిర్ణయం తీసుకోవడంపై బీజేపీ మండల అధ్యక్షుడు పీక వెంకన్న హర్షం వ్యక్తం చేశారు. పేద, సామాన్య ప్రజలు వినియోగించే వస్తువులపై, అన్నిరకాల వ్యక్తిగత జీవితబీమా, పలు బీమా పథకాలకు జీఎస్టీ నుంచి కేంద్రం మినహాయింపు ఇచ్చిందని అన్నారు. కోట్లాది మందికి ఉపయోగకరంగా ఉండే విధంగా జీఎస్టీని తగ్గించిన కేంద్రప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

కుక్కలతో జాగ్రత్తగా ఉండాలి

రామగిరి సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): కుక్కలతో అత్యంత జాగ్రత్తగా ఉండాలని మునిసిపల్ అసిస్టెంట్ కమిషనర్ రవీందర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని బొట్టుగూడెం పాఠశాలలో గురువారం విద్యార్థులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రధానంగా వీధి కుక్కలతో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ప్రమాదకరంగా మారిన కుక్కలను పట్టుకొని వాటిని ఏబీసీ కేంద్రానికి తరలించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పడకేసిన పారిశుధ్యం

- విజృంభిస్తున్న విషజ్వరాలు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు



మర్రిగూడ, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పల్లెల్లో పారిశుధ్యం పడకేసింది. ఇటీవల కురుస్తున్న వర్షాలకు తోడు డ్రైనేజీలు అస్తవ్యస్తంగా మారడంతో వీధుల్లో మురుగునీరు ప్రవహిస్తుంది. ఎక్కడపడితే అక్కడ నీరు నిల్వ ఉండటంతో ఏర్పడిన గుంతల్లో నీరు చేరి దోమలకు ఆవా సంగా మారాయి. దీంతో దోమలు వ్యాప్తి చెంది గ్రామాల్లో విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. మండలంలోని పలు గ్రామాల్లో పాటు పలు తండాలలో, వైరల్ జ్వరాలు సోకి ఇంటికో ఇద్దరు మంచం పట్టారు. మలేరియా, టైఫాయిడ్, వైరల్ జ్వరాలు వ్యాపించడంతో గ్రామస్థులు హడలెత్తిపోతున్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అధికారులు ప్రజలకు వివిధ కార్యక్రమాల ద్వారా అవగాహన కల్పిస్తున్నారు. కానీ ప్రజలు శ్రద్ధ చూపకపోవడం వల్ల అనారోగ్యానికి గురవుతున్నారు. అధికారుల అలసత్వం వల్ల దోమ కాటుకు వైరల్ ఫీవర్, విషజ్వరాలతో ప్రజలు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. వర్షాలు పడుతున్నాయన్న సంబురం కంటే జ్వరాలు సోకుతున్నాయన్న ఆందోళనే ప్రజల్లో ఎక్కువగా కనబడుతుంది. జలుబు, దగ్గు, తీవ్రజ్వరాలతో ప్రభుత్వ, ప్రైవేట్, ఆస్పత్రులకు బారులుదీరుతున్నారు. అవగాహన కార్యక్రమాలు చేపట్టి చాలాచోట్ల దోమల నివారణకు కృషి చేస్తున్నామని అధికారులు చెబుతున్నా క్షేత్రస్థాయిలో మాత్రం కనబడటం లేదని ప్రజలు పెదవి విరుస్తున్నారు. మండలంలోని పలు గ్రామాల ప్రజలు మలేరియా, టైఫాయిడ్ ప్రభుత్వ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్సపొందుతూ కనిపిస్తున్నారు. ముఖ్యంగా చిన్న పిల్లలు తీవ్ర జ్వరం, దగ్గు, జలుబు తలనొప్పితో బాధపడుతున్నారు. మరికొందరు తీవ్రమైన దగ్గుతూ ఊపిరి తీసుకోవడానికి ఇబ్బందులు పడుతూ ఆస్పత్రుల్లో చేరుతున్నారు.

మండలంలో జ్వరాల బారిన పడటంతో ఆస్పత్రి రోగులతో కిటకిటలాడుతుంది. విషజ్వరాలతో సోకి రోజుకు 300 నుంచి 350 మంది రోగులు ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చి వైద్యసేవలు పొందుతున్నారు. రోజు రోజులు జ్వర బాధితుల సంఖ్య పెరుగుతోందని, బాధితుల తాకిడికి ఏమీ చేయలేకపోతున్నామని వైద్యులు పేర్కొంటున్నారు. ప్రజలు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోకపోవడం, ఖాళీ స్థలాల్లో చెత్త వేయడం వల్లే ఈ పరిస్థితులు ఏర్పడుతున్నాయని వైద్యులు పేర్కొంటున్నారు. దోమలు విపరీతంగా పెరిగి ప్రజలను ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. దీనివల్ల మలేరియా, టైఫాయిడ్, వైరల్ ఫీవర్ రావడం వల్ల ప్రజలు పలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రజలు వైరల్ ఫీవర్ రోగాల బారిన పడకుండా ప్రభుత్వ అధికారులు స్పందించి వ్యాధులను నివారించేందుకు గ్రామాల్లో ప్రత్యేక వైద్యశిబిరాలను ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

దోమల బెడద ఎక్కువగా ఉంది



వర్షాభావ ప్రభావం వల్ల గ్రామంలో దోమలు బెడద ఎక్కువగా ఉంది. ప్రజలను కుట్టడం వల్ల దోమకాటుకు గురై విషజ్వరాల బారిన పడుతున్నారు. ప్రజలు జ్వరాల నుంచి బయటపడటానికి గ్రామాల్లో వైద్య ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేసి మెరుగైన వైద్యసేవలు అందించాలి.

- బండి హనుమంత్, రాంరెడ్డిపల్లి

టీపీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడిగా బాల్‌రెడ్డి



బాల్‌రెడ్డి

నార్కట్‌పల్లి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పీఆర్‌టీయూటీజీ ఉపాధ్యాయ సంఘం నల్లగొండ జిల్లా అధ్యక్షుడిగా నార్కట్‌పల్లి మండలంలోని నక్కలపల్లి జడ్పీ హైస్కూల్‌కు చెందిన ఉపాధ్యాయుడు చిలుముల బాల్‌రెడ్డి వరుసగా రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం రాత్రి జరిగిన సంఘ కమిటీ సమావేశంలో బాల్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకైనట్లు సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎన్.చంద్రశేఖర్‌రావు ప్రకటించారు. ఎన్నికల పరిశీలకులుగా సంఘం సూర్యాపేట జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామ్మోహన్, ఉపేందర్ వ్యవహరించారు. కార్యక్రమంలో జిల్లా బాధ్యులు ఆదినారాయణ, కవిత, విమల, మహ్మద్ ఇమాంకరీం, కొడిదల శంకర్ పాల్గొన్నారు.

ఇద్దరు ఆర్టీసీ అధికారుల బదిలీ

నల్లగొండ, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఇద్దరూ ఆర్టీసీ అధికారులను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీఅయ్యాయి. నల్లగొండ డీఎం శ్రీనాథ్‌ను బదిలీ చేయగా ఆయన స్థానంలో ఎంపీ రమణను నియమించారు. అదేవిధంగా మెకానికల్ ఇంజనీర్ వి.సునీతను పదోన్నతిపై సత్తుపల్లి డిపోకు డీఎంగా బదిలీ చేశారు.

యూరియా కొరతను నివారించాలి



తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే లింగయ్య, నాయకులు

చిట్యాల, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): యూరియా కొరతను నివారించాలని మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ఆధ్వర్యంలో గురువారం మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద నిర్వహించిన ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు. యూరియా కోసం రైతులు గంటల కొద్దీ క్యూలైన్లలో నిలబడుతూ ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వానికి ముందస్తు ప్రణాళిక లేకపోవడం వల్లే రైతులు యూరియాకు ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. సాగు సీజన్‌లో యూరియా అందక రైతులకు ఎటూ పాలుపోవడం లేదని, బీఆర్ఎస్ హయాంలో రైతులకు సరిపడా యూరియా అందించామని తెలిపారు. కాంగ్రెస్ మాటలే కానీ చేతల ప్రభుత్వం కాదని విమర్శించారు. వెంటనే రైతులకు సరిపడా యూరియా అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు పొన్నం లక్ష్మయ్య, కూరెల్ల లింగస్వామి, కొలను వెంకటేష్, రాచకొండ కిష్టయ్య, బొబ్బల శివశంకర్‌రెడ్డి, ఆగు అశోక్, అరూరి శ్రీశైలం, నేలపట్ల సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులకు ప్యాడ్ల పంపిణీ

కనగల్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేగట్టే జడ్పీ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు అమ్మ ఆదర్శ ఫౌండేషన్ సభ్యులు పరీక్ష ప్యాడ్లను పంపిణీ చేశారు. మాజీ వైస్ఎంపీపీ బారత వెంకటేశం పుట్టినరోజును పురస్కరించుకుని గురువారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ప్యాడ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం శ్రీనివాస్ మాట్లాడుతూ అమ్మ ఆదర్శ ఫౌండేషన్ సభ్యులు చేపడుతున్న సేవా కార్యక్రమాలను కొనియాడారు. కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ ఎర్రోల సురేష్, సభ్యులు జానీ, నాయకులు అశోక్, అంజనేయులు, పాండు, నరేష్, శంకర్, శరత్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు కంప్యూటర్ బహూకరణ

మునుగోడు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మునుగోడు హైస్కూల్‌కు లక్ష రూపాయల విలువైన కంప్యూటర్, స్కానర్‌తో పాటు ప్రింటర్లను తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ కుటుంబ సభ్యులు అందజేశారు. గురువారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో తన తండ్రి గాదరి మారయ్య జ్ఞాపకార్థం అందజేస్తున్నట్లు తెలిపారు. గురువారం హైస్కూల్‌లో ఉపాధ్యాయ బృందానికి మాజీ ఎమ్మెల్యే తల్లి గాదరి సుజాతతో పాటు కుటుంబసభ్యులు గాదరి కిరణ్‌కుమార్, గోలి చెన్నకేశవులు అందజేశారు. విద్యార్థుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని తమ పాఠశాలకు లక్ష రూపాయల విలువైన కంప్యూటర్, ఇతర సామగ్రిని అందజేయటం అభినందనీయమని హెచ్ఎం బాలప్రసాద్ అన్నారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయుడు విద్యాసాగర్, ఇతర ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పట్టణ సమస్యలు పరిష్కరించాలి

చిట్యాల, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): చిట్యాల మునిసిపాలిటీలోని సమస్యలను వెంటనే పరిష్కరించాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు గుండాల నరేష్‌గౌడ్ డిమాండ్ చేశారు. బీజేపీ ఆధ్వర్యంలో గురువారం మునిసిపల్ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నరేష్‌గౌడ్ మాట్లాడుతూ భువనగిరి రోడ్డును నాలుగు వరుసలుగా విస్తరించాలని, డంపింగ్‌యార్డులను పట్టణానికి దూరంగా తరలించాలని కోరారు. అమృత్ పథకం పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, ప్రభుత్వ భూముల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సీమోర్చా రాష్ట్ర కార్యదర్శి మాస శ్రీనివాస్, చికిలంమెట్ల అశోక్, కన్నెబోయిన మహాలింగం, పల్లె వెంకన్న, గంజి గోవర్ధన్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రోగాల బారిన పడకుండా చర్యలు తీసుకోవాలి

కట్టంగూరు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): కట్టంగూరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మండల ప్రత్యేకాధికారి సతీష్‌కుమార్, ఎంపీడీవో జ్ఞాన ప్రకాశ్‌రావు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రజలు వర్షాకాలంలో రోగాల బారిన పడకుండా తగు చర్యలు చేపట్టాలని వైద్యులకు సూచించారు. అనంతరం మండల వైద్యాధికారి శ్వేతతో కలిసి కట్టంగూరులోని కేజీబీవీ పాఠశాలకు వెళ్లి అక్కడ ఉన్న విద్యార్థినులకు వైద్య పరీక్షలు చేయించారు. అనంతరం వైద్యురాలు విద్యార్థులకు పలు సూచనలు చేశారు. దీంతో పాటు కట్టంగూరులోని పీఏసీఎస్ వద్దకు వెళ్లి యూరియా సరఫరా జరిగే విధానాన్ని అడిగి తెలుసుకున్నారు.

రైతులకు అవగాహన సదస్సు

చండూరు, సెప్టెంబరు4 (ఆంధ్రజ్యోతి): నాబార్డు, నల్లగొండ జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఆధ్వర్యంలో గురువారం చండూరు రైతు సేవా సహకారం సంఘం కార్యాలయంలో ఆర్థిక, అక్షరాస్యత, నగదు రహిత లావాదేవీలపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. సంఘం జిల్లా కేంద్ర సహకార బ్యాంకు డైరెక్టర్ కోడి సుష్మ వెంకన్న ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. బ్యాంకు ద్వారా అందిస్తున్న సేవలను రైతులకు వివరించారు. తాకట్టు, ఎడ్యుకేషన్, గోల్డ్‌లోన్, రైతు రుణాలు సంఘం ద్వారా పొందవచ్చని వివరించారు. కార్యక్రమంలో ఎన్డీసీసీబీ బ్రాంచ్ చండూరు మేనేజర్ అనుముల భరత్, సెక్రటరీ అమరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల బస్సు కింద పడి చిన్నారి దుర్మరణం



జశ్విత (ఫైల్‌ఫొటో)

నల్లగొండ, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి బస్సులో పాఠశాలకు బయలుదేరిన ఓ చిన్నారికి అదే వాహనం మృత్యుశకటమైంది. బస్సు కిందపడి చిన్నారి మృతి చెందింది. గురువారం జిల్లా కేంద్రంలో ఈ సంఘటన జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. నల్లగొండ మండలం తొరగల్లు గ్రామానికి చెందిన జశ్విత (4) నల్లగొండలోని దుప్పలపల్లి రోడ్డులో ఉన్న మాస్టర్‌మైండ్ పాఠశాలలో ఎల్‌కేజీ చదువుతోంది. గురువారం ఉదయం తొరగల్లు నుంచి బస్సులో బయలుదేరి పాఠశాల వద్ద దిగుతున్న సమయంలో డ్రైవర్ చూసుకోకుండా బస్సును కదిలించాడు. దీంతో జశ్విత టైర్ల కింద పడి తీవ్రగాయాలపాలైంది. బస్సు కింద పడిన విషయాన్ని గమనించిన స్థానికులు బాలికను చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు చిన్నారి అప్పటికే మృతి చెందిందని నిర్ధారించారు. బస్సు డ్రైవర్ అజాగ్రత్తతోనే ఈ ప్రమాదం చోటు చేసుకున్నట్లు పోలీసులు గుర్తించారు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు, స్థానికులు పాఠశాల వద్దకు చేరుకుని ఆందోళనకు దిగారు. పాఠశాల వద్దకు బస్సు వచ్చిన సమయంలో పిల్లలు బస్సు దిగుతున్నప్పుడు ఆయాను లేదా అటెండర్‌ను ఉంచాల్సినప్పటికి ఏమాత్రం పట్టించుకోకపోవడంతోనే ఇలా జరిగిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏబీవీపీ ఆధ్వర్యంలో పాఠశాల ఎదుట ఆందోళనకు దిగటంతో పోలీసులు పలు విద్యార్థులను అరెస్టు చేశారు. చిన్నారి తల్లిదండ్రులు చింతపల్లి సైదులు, రాధిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు.

ఘనంగా గణేషుడి నిమజ్జనోత్సవాలు



కనగల్ : శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

కనగల్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లో గణేషుడి నిమజ్జనోత్సవాలు గురువారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. డప్పు చప్పుళ్ల, యువకుల డ్యాన్సులు, కోలాట ప్రదర్శనలతో ఊరేగింపుగా సమీప చెరువు కుంటలకు తరలించి సంప్రదాయబద్ధంగా గంగఒడిలో నిమజ్జనం చేశారు. దర్వేశిపురం ఎల్లమ్మ ఆలయం కల్యాణ మండపం వద్ద స్థానిక వ్యాపారులు నిలబెట్టిన గణేషుడికి ఆలయ కమిటీ చైర్మన్ చీదేటి వెంకట్‌రెడ్డి, ఈవో నాగిరెడ్డి ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం వినాయకుడి విగ్రహాన్ని సమీప కాల్వ నీటిలో నిమజ్జనం చేశారు. పలు గ్రామాల్లో వినాయక మండపాల వద్ద దాతల సహకారంతో ఉత్సవ కమిటీలు భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

చండూరు: చండూరు మునిసిపల్ పరిధిలో శివాజీనగర్‌లో ఏర్పాటు చేసిన గణేష్ మండపం వద్ద ఆర్డీవో శ్రీదేవి ప్రత్యేక పూజలు చేశారు. శాంతియుత వాతావరణంలో భక్తిశ్రద్ధలతో నవరాత్రి ఉత్సవాలు నిర్వహించుకోవాలని అన్నారు. నిమజ్జనం చేసే ప్రాంతంలో ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో నాంపల్లి తహసీల్దార్ దేవాసింగ్, మునిసిపల్ మాజీ కౌన్సిలర్ కోడి వెంకన్న భక్తులు పాల్గొన్నారు.

గట్టుప్పల్‌లో అన్నదానం

గట్టుప్పల్: మండలకేంద్రంలోని సీతారామరాజునగర్‌లో గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో నామని జగన్నాథం, గజవెల్లి లక్ష్మయ్య, చేరుపల్లి జగన్నాథం, మధు, వెంకటేశం, కర్నాటి లింగయ్య, కర్నాటి వెంకటేశం, తుకరం ముషం చంద్రమౌళి, కర్నాటి వెంకటేశం, నామని పవన్, చేరుపల్లి ఈశ్వరయ్య, చేరుపల్లి వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ సెలవులో ఉన్నా జీతం

- ఉపాధ్యాయ వర్గాల్లో చర్చనీయాంశమైన వైనం

నల్లగొండ, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మెడికల్ లీవ్‌లో ఉన్న ఉపాధ్యాయురాలికి నిబంధనలకు విరుద్ధంగా జీతం డబ్బులను చెల్లించిన వ్యవహారం ఉపాధ్యాయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. ఈ విషయం కనగల్ మండలంలో జరిగింది. కనగల్ హైస్కూల్ కాంప్లెక్స్ పరిధిలో గల పర్వతగిరి పాఠశాలలో పనిచేసి ఇటీవల బదిలీపై వెళ్లిన ఓ ఉపాధ్యాయురాలు తన బదిలీకి ముందు జూలై 1 నుంచి ఆగస్టు 31 వరకు రెండు నెలల పాటు మెడికల్ లీవ్ తీసుకుని విధులకు హాజరు కాలేదు. అయితే ఈ రెండు నెలల కాలానికి సంబంధించిన జీతం డబ్బులను నిలిపివేసి సంప్లిమెంటరీ బిల్లుల ద్వారానే అందజేయాల్సి ఉంది. ఇవేమీ పట్టించుకోకుండా కాంప్లెక్స్ హెచ్ఎం ఆమెకు జీతం బిల్లులను చెల్లించగా పలు విమర్శలు వస్తున్నాయి. ఓ పక్క మెడికల్ సెలవుల మంజూరు చేయటంతో పటు మరో పక్క జీతం చెల్లించారు. ఈ విషయమై ఎంఈవో పద్మను వివరణ కోరగా విషయం తనకు ఆలస్యంగా తెలిసిందని డీఈవో దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు.

ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్లే యూరియా కొరత

మర్రిగూడ, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అసమర్థత, నిర్లక్ష్యం వల్లే రాష్ట్రంలో యూరియా కొరత ఏర్పడిందని రైతుబంధు సమితి మాజీ అధ్యక్షుడు బచ్చు రామకృష్ణ, శివన్నగూడ పీఏసీఎస్ చైర్మన్ బాలం నరసింహలు అన్నారు. మండలకేంద్రంలో గురువారం వారు విలేకరులతో మాట్లాడారు. సాగు చేసిన రైతులకు యూరియా సరఫరా చేయడంలో ప్రభుత్వం విఫలమైందని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యూరియా నిల్వలపై ముందుచూపు లేకపోవడం వల్ల రైతాంగం యూరియా కొరతతో ఇబ్బందులు పడుతున్నారు. ఈ కార్యక్రమంలో వెంకట్రాం, శ్రీరాములు, రవి, మనోహర్, యాదగిరి, సతయ్య, ప్రవీణ్ పాల్గొన్నారు.

క్రమశిక్షణతో చదువుకోవాలి



విద్యార్థులకు నోటు బుక్స్, పెన్నులు అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

శాలిగౌరారం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించి మంచి భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని హైదరాబాద్ చీర్స్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు బత్తిన అశోక్‌గౌడ్ అన్నారు. మండలంలోని ఊట్కూరు జడ్పీ, ప్రాథమిక పాఠశాల, శాలిగౌరారం ప్రాథమిక పాఠశాలలోని నిరుపేద విద్యార్థులకు చీర్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నోట్ బుక్స్, పెన్నులు, స్టేషనరీ అందజేశారు. ఈ కార్యక్రమంలో చీర్స్ ఫౌండేషన్ సభ్యులు ఆకుల ఉదయ్‌కుమార్, కీర్తి కుమార్, హిమబిందు, ప్రదీప్, సురేష్, హెచ్ఎం సత్యనారాయణ, ప్రభాకర్, కృష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైంది



చినమాదారం హైస్కూల్‌లో ఉపాధ్యాయులకు సన్మానం

కనగల్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైందని ఎంఈవో పద్మ అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం గురువారం చినమాదారం హైస్కూల్‌లో సర్వేపల్లి రాధాకృష్ణ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులకు శాలువా కప్పి సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి, ఎజాజ్‌హుస్సేన్ రజిత, రమేష్‌రెడ్డి, మధు, ఇందురాణి, శశిరేఖ, విజయశ్రీ, ఉమా, నరేందర్‌రెడ్డి, వాసు, రాజు, నర్సింహ, సైదమ్మ, సంపూర్ణ విద్యార్థులు తదితరులున్నారు.

● చండూరు : చండూరులోని డాన్‌బోస్కో కళాశాలలో అధ్యాపకులను విద్యార్థులు శాలువాలతో సత్కరించారు. కళాశాల కరస్పాండెంట్ ఫాదర్ రాజేష్, ప్రిన్సిపాల్ విల్సన్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థులకు మార్గదర్శకత్వాన్ని సూచించే సామాజికనిర్మాతలన్నారు.అనంతరంవిద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు.

● మునుగోడు : లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక హైస్కూల్ ఆవరణలో ఉపాధ్యాయలకు జ్ఞాపికలను అందజేసి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సెక్రటరీ పాలకూరి నరసింహగౌడ్, వైస్ ప్రెసిడెంట్ మిర్యాల వెంకటేశ్వర్లు, హైస్కూల్, ఎంపీపీఎస్ హెచ్ఎంలు బాలప్రసాద్, బిక్షంగౌడ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట ధర్నాను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు నరేష్

నల్లగొండ, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల పింఛన్లు పెంచే విషయంలో సీఎం వైఖరిని నిరసిస్తూ ఈనెల 8వ తేదీన జిల్లా కలెక్టరేట్ ఎదుట నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేష్ తెలిపారు. స్థానిక టీఎన్జీవోఎస్ భవనంలో గురువారం ఎమ్మార్పీఎస్, దివ్యాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. 2023 ఎన్నికల సమయంలో రేవంత్‌రెడ్డి ఇచ్చిర హామీ ప్రకారం దివ్యాంగులకు పింఛన్ రూ. 6 వేలు, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, నేత, గీత కార్మికులతోపాటు మొత్తం చేయూత పింఛన్లు రూ. 4 వేలు పెంచడంలో నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. 8న చలో కలెక్టరేట్, 12న ఎమ్మార్వో కార్యాలయాల ఎదుట ధర్నా, 20 వతేదీన హైదరాబాద్ విజయవాడ జాతీయ రహదారి దిగ్బంధం, 21నుంచి 26వరకు గ్రామ పంచాయతీ ఎదుట ధర్నా, 27న రాష్ట్ర వ్యాప్తంగా రహదారుల దిగ్బంధంవంటి ఉద్యమ కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు ఇరిగి శ్రీశైలం, రాష్ట్ర, జిల్లా నాయకులు గాదె రమేష్ మాదిగ, మేడి శంకర్ మాదిగ, పోలేని యాదయ్య, ఏడుకొండలు, గోపాల్, శ్రీను, మాసారం వెంకన్న, రాములు, దశరథ, సుల్తానా బేగం, తదితరులు పాల్గొన్నారు.

యువకుడి నేత్రాలు దానం

చిట్యాలరూరల్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నకాపర్తికి చెందిన శ్రీకాంత్ రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా అతడి నేత్రాలను దానం చేసేందుకు కుటుంబ సభ్యులు అంగీకరించారు. లయన్స్‌క్లబ్ ఆఫ్ నల్లగొండ ప్రతినిధి, కంటివైద్యుడు డాక్టర్‌పుల్లారావు ఆధ్వర్యంలో యువకుడి నేత్రాలను సేకరించారు. కార్యక్రమంలో ఆసరా స్వచ్ఛంద సేవాసంస్థ వ్యవస్థాపకుడు మేడి హరికృష్ణ, లయన్స్‌క్లబ్ ఆఫ్ నల్లగొండ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ కేవవీ ప్రసాద్, హరినాథ్, కుడుతాల నాగేష్, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ సీనియర్ నేత రాములు మృతి

నార్కట్‌పల్లి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నార్కట్‌పల్లి పట్టణానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నేత లింగాల రాములు (80) బుధవారం రాత్రి మృతిచెందారు కొంత కాలంగా అనారోగ్య సమస్యతో బాధపడుతూ వైద్యచికిత్స కోసం నిమ్స్‌కు వెళ్లిన ఆయన గుండెపోటు వచ్చి మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడిగా రాశి రిఫ్యాక్టరీస్ కంపెనీ కార్మిక సంఘం అధ్యక్షుడిగా ఆయన పనిచేశారు. రాములు మృతి పట్ల మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, బత్తుల ఊశయ్య, దూదిమెట్ల సత్తయ్య, పాశం శ్రీనివాస్‌రెడ్డి, అయితరాజు యాదయ్య, జెరిపోతుల భరత్, మేడబోయిన శ్రీనివాస్, పాల్వాయి భాస్కర్‌రావు, చింతపల్లి బయ్యన్న తదితరులు రాములు మృతదేహనికి పూలమాల వేసి నివాళులర్పించారు.

నేడు గణేష్ నిమజ్జన శోభాయాత్ర

(3వ పేజీ తరువాయి)

పోలీసులు రూట్ మ్యాప్‌ను రూపొందించారు. మధ్యాహ్నం 1గంట వరకు మొదటి విగ్రహం క్లాక్‌టవర్ సెంటర్‌కు చేరుకుంటుంది. హైదరాబాద్ రోడ్, రామగిరి, గొల్లగూడ, తదితర ప్రాంతాల నుంచి వినాయక విగ్రహాలు ప్రకాశంబజార్ మీదుగా 14వ మైలురాయి దగ్గరకు వెళ్లేలా, మిగతా విగ్రహాలు ఆర్జాలబావి దగ్గరలోని బతుకమ్మకుంటలో నిమజ్జనం చేసేలా అధికారులు రూట్‌మ్యాప్ రూపొందించారు.

గణేష్ విగ్రహాలు తొమ్మిది అడుగులకు పైగా ఉన్నవాటిని 14వ మైలురాయి కాల్వ వద్ద, ఆ లోపు ఉన్న విగ్రహాలను ఆర్జాలబావిలోని బతుకమ్మ కుంట వద్ద నిమజ్జనం చేసేలా అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. ఇప్పటికే ఆయా ప్రాంతాల్లో వినాయకులను నిమజ్జనం చేసేందుకు క్రేన్లు, లైట్లు, గజ ఈతగాళ్లు, తదితర సౌకర్యాలను కల్పించారు. గణేష్ నిమజ్జన శోభాయాత్రను ప్రశాంతంగా నిర్వహించాలని గణేష్ ఉత్సవ సమితి అధ్యక్షుడు యాదగిరి పిలునిచ్చారు.

అన్ని ఏర్పాట్లు చేయాలి : కలెక్టర్, ఎస్పీ

(ఆంధ్రజ్యోతి, హాలియా): వినాయక నిమజ్జనానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తిచేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అధికారులను ఆదేశించారు. గురువారం హాలియా మునిసిపాలిటీ పరిధిలోని 14వ మైలురాయి వద్ద నిమజ్జన స్థలాన్ని వారు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, వినాయక నిమజ్జనానికి క్రేన్లను ఏర్పాటు చేసి గజ ఈతగాళ్లను సిద్ధం చేయాలన్నారు. లైటింగ్, తాగునీరు, బందోబస్తు వంటి సౌకర్యాలను పూర్తిస్థాయిలో కల్పించాలని ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి నిమజ్జనంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా చూడాలన్నారు. వారి వెంట అదనపు కలెక్టర్ నారాయణ్ అమిత్, డీఎస్పీ శివరాంరెడ్డి, మునిసిపల్ కమిషనర్ మండడి రాము దుర్గారెడ్డి, సీఐ సతీష్‌రెడ్డి, ఎస్ఐ సాయిప్రశాంత్, ఎంపీడీవో సుజాత, తదితరులు ఉన్నారు.

తీరు మారడం లేదు!

(3వ పేజీ తరువాయి)

చింతలపాలెం ఎస్ఐ అంతిరెడ్డి బియ్యం అక్రమరవాణా కేసులో అరెస్టయిన వ్యక్తికి స్టేషన్ బెయిల్ ఇచ్చే అంశంలో రూ.10వేల లంచం తీసుకుంటూ పట్టుబట్టారు.

● సూర్యాపేట జిల్లా కేంద్రంలో నకిలీ వైద్యుల కేసు విషయంలో సూర్యాపేట సీఐ వీరరాఘవులు, డీఎస్పీ పార్థసారధి రూ.16లక్షల లంచం డిమాండ్ చేయగా, వారు ఏసీబీని ఆశ్రయించగా మే 12న రెడ్‌హ్యాండెడ్‌గా ఆధారాలతో సహా పట్టుకొని అరెస్ట్ చేశారు.

● పెన్‌పహాడ్ మండలం నాగులపాటి అన్నారం గ్రామానికి చెందిన పంచాయతీ కార్యదర్శి రూ.8వేల లంచం తీసుకుంటూ జూన్ 26న ఏసీబీకి చిక్కాడు.

● జూన్ 26న హుజూర్‌నగర్ తహసీల్దార్ కార్యాలంలో భూభారతి ఆపరేటర్ విజేతారెడ్డి రూ.12వేల లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డారు.

● జూలై 7న పౌరసరఫరాలశాఖ మిర్యాలగూడ డీటీ జావెద్ ఏసీబీకి పట్టుబట్టారు. బియ్యం అక్రమరవాణా కేసులో పట్టుబడిన మూడు వాహనాలకు రిలీజింగ్ ఆర్డర్ ఇచ్చేందుకు వాహన యజమానులను రూ.1లక్ష లంచం అడగ్గా, వారు ఇవ్వలేమని చెప్పినా వినకుండా కనీసం రూ.70వేలు ఇవ్వాలని డిమాండ్ చేసి రిలీజింగ్ ఆర్డర్ ఇవ్వకపోవడంతో వారు ఏసీబీని ఆశ్రయించారు. ఏసీబీ అధికారులు జావేద్‌ను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకొని అరెస్ట్ చేసి నాంపల్లి ఏసీబీ కోర్టులో హాజరుపరిచారు.

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	587.20 (300.0450)	84,995	51,884
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643.52 (4.07)	1,774.75	2,193.71
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	173.292 (43.1584)	35,800	17,000

చికెన్ ధరలు | లైవ్ : రూ.120 | డ్రెస్ : రూ.200 | స్కిన్‌లెస్ : రూ.220



ప్రభుత్వశాఖల్లో అధికారులు, ఉద్యోగుల అవినీతి ఆగడం లేదు. తరచూ ఏసీబీకి పట్టుబడుతున్నా లంచాలు పుచ్చుకునేందుకు ఏ మాత్రం వెనకంజ వేయడం లేదు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఎలాంటి లంచాలు తీసుకోకుండా పారదర్శకంగా సిటిజన్ చార్టర్ ప్రకారం పనులు నిర్వహించాల్సిన అధికారులు వాటిని గాలికివదిలేసి యథేచ్ఛగా అవినీతికి పాల్పడుతూ పనులు చక్కబెడుతున్న తీరు తరచూ వెలుగులోకి వస్తోంది. ఎలాంటి బెదురు లేకుండా ఏకంగా పనిచేసే కార్యాలయాల్లోనే లంచాలు తీసుకుంటూ పట్టుబడుతున్నారు. ఆమ్యామ్యాలు ఇవ్వపోతే నెలల తరబడి కార్యాలయాల చుట్టూ తిరిగినా పనులు కావడం లేదని, అదే దొడ్డిదారిలో అయితే చిటికెలో పనిచేసి పెడుతున్నారనే ఆరోపణలు అన్ని శాఖల అధికారులపై ఉన్నాయి.

- (ఆంధ్రజ్యోతి ప్రతినిధి,నల్లగొండ)

తీరు మారడం లేదు!



ఏసీబీకి పట్టుబడిన చరితారెడ్డి

- ఏసీబీకి పట్టుబడుతున్నా మారని ఉద్యోగులు
- ఉమ్మడి జిల్లాలో చిక్కుతున్న అవినీతి తిమింగలాలు
- సగటున నెలకో కేసు నమోదు
- కీలకశాఖల్లో రాజ్యమేలుతున్న అవినీతి
- కేసుల విచారణలో జాప్యమూ కారణమే

ప్రతీ సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే 'ప్రజావాణి'కి వచ్చే ఫిర్యాదుల్లో లంచాలు ఇవ్వలేనిస్థితిలో ఉన్న బాధితులే ఉంటున్నారని తెలుస్తోంది. గురువారం నల్లగొండ జిల్లా మత్స్యశాఖ అధికారి చరితారెడ్డి తన కార్యాలయంలోనే మత్స్యసొసైటీ సభ్యుల నుంచి రూ.20వేలు లంచం తీసుకుంటూ పట్టుబడడం చర్చనీయాంశమైంది.

కీలకశాఖలకు అవినీతి మకిలి..

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఈ ఏడాది సగటున నెలకో అవినీతి తిమింగలాన్ని ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. వరుసగా ఏసీబీకి పట్టుబడి ఉద్యోగాలు కోల్పోతున్నా మిగిలిన వారిలో ఏమాత్రం బెదురు ఉండడం లేదు. ఈ ఏడాది తాజాగా చరితారెడ్డి కేసుతో కలిపి 8 ఏసీబీ కేసులు నమదవ్వగా, గత ఏడాది 11 కేసులు నమోదయ్యాయి. ప్రధానంగా విద్యుత్, రెవెన్యూ, పోలీసశాఖలోని అధికారులే ఏసీబీకి పట్టుబడుతున్నారు. అయితే మునిసిపల్, పట్టణ ప్రణాళిక, రిజిస్ట్రేషన్లు, ల్యాండ్ సర్వే శాఖల్లోనూ అవినీతి రాజ్యమేలుతుందనే ఆరోపణలు ఉన్నాయి. పలువురు బాధితులు నేరుగా ఫిర్యాదులు చేయలేక బతిమాలో, భంగపడో పనులు చేయించుకుంటున్నామని పలువురు చెబుతున్నారు.

సగుటన నెలకో కేసు..

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 2024లో 11 ఏసీబీ కేసులు నమోదు కాగా, ఈ ఏడాది ఇప్పటివరకు 8 కేసులు నమోదయ్యాయి. గురువారం నాటి ఘటనలో జిల్లా స్థాయి అధికారే ఏసీబీకి పట్టుబడ్డారు. అయితే ఏసీబీకి పట్టుబడిన తక్షణం విధుల నుంచి సస్పెండ్ చేయగా, తిరిగి ఐదారు నెలల తర్వాత సస్పెన్షన్ ఎత్తివేయించుకొని మళ్లీ ఉద్యోగాల్లో చేరుతున్నారని, కోర్టుల్లోనూ కేసులు సంవత్సరాల తరబడి కొనసాగుతుండడంతో కఠిన చర్యలకు ఆయా శాఖలలో జాప్యం జరుగుతోందని పలువురు అభిప్రాయపడుతున్నారు. అంతేగాక ప్రజాప్రతినిధుల అండదండలతో ఏసీబీకి పట్టుబడ్డ అధికారులు సైతం మళ్లీ కీలక పోస్టింగులు పొందుతుండడంతో ఏసీబీ కేసుల్లో పట్టుబడిన సమయంలో కనిపించిన భయం, ఆతర్వాత ఉద్యోగుల్లో లేకుండా పోయిందనే అభిప్రాయం వెల్లడవుతోంది.

ఈ ఏడాది కేసులు ఇలా..

- జనవరి 12న సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నియోజకవర్గం తిరుమలగిరిలో పీడీఎస్ బియ్యం అక్రమరవాణా కేసులో ఎస్ఐ సురేష్, కానిస్టేబుల్ నాగరాజు రూ.70వేల లంచం తీసుకుంటూ పట్టుబడ్డారు.
- మార్చి 6న యాదాద్రి జిల్లా చౌటుప్పల్‌లో ట్రాన్స్‌కో ఏడీ శ్యాంప్రసాద్ ఓ ఫార్మాకంపెనీకి విద్యుత్ కనెక్షన్ ఇచ్చేందుకు, మీటర్ మార్చేందుకు రూ.70వేల లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కారు.
- ఏప్రిల్ 10న సూర్యాపేట జిల్లా

- మిగతా 6వ పేజీలో...

నేడు గణేష్ నిమజ్జన

శోభాయాత్ర



14వ మైలు వద్ద నిమజ్జన ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నిమజ్జనానికి ఏర్పాట్లు పూర్తి

నల్లగొండ కల్చరల్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నవరాత్రులు భక్తుల పూజలు అందుకున్న గణనాథుడు నేడు తల్లి గంగమ్మ ఒడికి చేరనున్నాడు. ఈ మేరకు జిల్లా వ్యాప్తంగా గణేష్ నిమజ్జన శోభాయాత్రలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. విగ్రహాలను నిమజ్జనం చేయనున్న చెరువుల వద్ద అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు, చర్యలు తీసుకుంటున్నారు. మునిసిపాలిటీలు, స్థానిక సంస్థలు, రెవెన్యూ, పోలీస్, ట్రాన్స్‌కో, ఇరిగేషన్, మత్స్య, ఎక్సైజ్, ఆర్‌అండ్‌బీ, వైద్యఆరోగ్య తదితర ప్రభుత్వ శాఖలు, గణేష్ ఉత్సవ సమితులు సంయుక్తంగా నిమజ్జన ఏర్పాట్లలో భాగస్వాములయ్యాయి. జిల్లా కేంద్రంలో హనుమాన్‌నగర్‌లోని తొలి విగ్రహం వద్ద ఉదయం 8.30గంటలకు ప్రత్యేక పూజల్లో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్ పాల్గొని శోభాయాత్రను లాంఛనంగా ప్రారంభించనున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, శాంతిసంఘం, ఉత్సవ సమితి సభ్యులు పాల్గొని శోభాయాత్రను ముందుండి నడిపించనున్నారు. హనుమాన్‌నగర్ నుంచి మొదలయ్యే శోభాయాత్ర పట్టణ పుర వీధుల నుంచి సాగనుంది. పట్టణంలో నెలకొల్పిన వినాయకుడి విగ్రహాలన్నీ వరుస క్రమంలో క్లాక్ టవర్ సెంటర్ మీదుగా తరలివెళ్లే

- మిగతా 6వ పేజీలో...

నేరశోధనలో సీసీ కెమెరాల

పాత్ర కీలకం

- ఎస్పీ శరత్‌చంద్ర పవార్
- సీసీ కెమెరాల పనితీరును పరిశీలించిన కలెక్టర్ ఇలా త్రిపాఠి



సీసీ కెమెరాల ఏర్పాటు కోసం వ్యాపారవేత్తల రూ.10లక్షల చెక్కును కలెక్టర్ త్రిపాఠి, ఎస్పీ శరత్‌చంద్రపవార్‌కు అందజేస్తున్న ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, ఎమ్మెల్యే బీఎల్ఆర్

మిర్యాలగూడ, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నేరాల పరిశోధనలలో సీసీ కెమెరాల పాత్ర కీలకంగా మారిందని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అన్నారు. గురువారం టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, నేర నియంత్రణ, నేరం జరిగిన తరువాత వేగవంతమైన దర్యాప్తునకు సీసీ కెమెరాలు ఎంతగానో తోడ్పడతాయన్నారు. జిల్లాలోని హైవేలపై, ప్రధాన కూడళ్లు, వ్యాపార కేంద్రాలు, ఐసోలేటెడ్ ప్రాంతాల్లో ఆటోమేటెడ్ నెంబర్‌ప్లేట్ ఐడెంటిఫై సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. వీటి ద్వారా వాహనాల నెంబర్‌ప్లేట్ల వివరాలు తెలుస్తాయని అన్నారు. మిర్యాలగూడలో 96 కెమెరాలు ఏర్పాటు చేయగా, వాటితో కలిపి జిల్లాలో మొత్తం 2,300 కెమెరాలు ఉన్నాయన్నారు. అన్ని కెమెరాలు జిల్లా కేంద్రంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు, హైదరాబాద్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ సెంటర్‌కు అనుసంధానం చేశామన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటు కోసం పట్టణ వ్యాపారవేత్తలు ఇచ్చిన రూ.10లక్షల చెక్కును ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో డీఎస్పీ రాజశేఖర్‌రాజు అందజేశారు. కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ నారాయణ్‌అమిత్, సీఐలు సోమనర్సయ్య, నాగభూషణం, పీఎస్‌డీ ప్రసాద్, ఎస్ఐలు సైదిరెడ్డి, అమ్రిన్, కాంగ్రెస్ నాయకులు వేణుగోపాల్‌రెడ్డి, చిలుకూరి బాలు, ముదిరెడ్డి నర్సిరెడ్డి, పొదిల శ్రీనివాస్ పాల్గొన్నారు.

చారిత్రక వారసత్వాన్ని నిలబెట్టుకోవాలి

తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర నేత హరికృష్ణ



ముల్కీ డే సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతున్న హరికృష్ణ

మిర్యాలగూడ, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ చారిత్రక వారసత్వాన్ని నిలబెట్టుకోవాలని తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర నేత బెల్లంకొండ హరికృష్ణ అన్నారు. గురువారం ముల్కీ డే సందర్భంగా టీవీవీ ఆధ్వర్యంలో పట్టణంలోని విజేత డిగ్రీకళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ అస్తిత్వాన్ని, సంస్కృతిని, రాజకీయాలను దెబ్బతీసే చర్యలను సమాజం సహించదని అన్నారు. 1952 లెగైర్ ముల్కీ ఉద్యమానికి, 1969 తొలిదశ ఉద్యమానికి, మలిదశ ఉద్యమానికి ఊతమిచ్చిందని అన్నారు. నీళ్లు, నియామకాలు, వనరులు, సంపద కోసం కొట్లాడిన తెలంగాణలో పొట్టకూటికి వచ్చిన దేశ, విదేశీయులకు బతక నీడనిచ్చిందన్నారు. పొట్టకొట్టాలని చూస్తే ఈ ప్రాంతం నుంచి తరిమివేసే చరిత్ర ముల్కీ ఉద్యమంకాలం నుంచే కొనసాగుతోందని అన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ తెడ్ల ధనుంజయ, వైస్ ప్రిన్సిపాల్ మధు, చారి, యాదయ్య, దుర్గయ్య, రాజారాం, పాల్గొన్నారు.

గణితశాస్త్ర జాతీయ సదస్సు విజయవంతం

ఎంజీయూ వీసీ అల్తాఫ్ హుస్సేన్

నల్లగొండ, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గణిత శాస్త్ర జాతీయ సదస్సు విద్యార్థులను పరిశోధనల వైపు ఆసక్తి కలిగించేలా సాగిందని, ఈ సదస్సు విజయవంతంగా పూర్తయిందని ఎంజీయూ వీసీ అల్తాఫ్ హుస్సేన్ అన్నారు. గురువారం ఎంజీయూలో రెండు రోజుల పాటు నిర్వహించిన గణిత విభాగం జాతీయ సదస్సు ముగింపు సందర్భంగా ఆయన మాట్లాడారు. పలు యూనివర్సిటీల నుంచి అధ్యాపకులు హాజరై గణిత శాస్త్ర విషయాలను వివరించారన్నారు. అదేవిధంగా విద్యార్థులు పరిశోధనా పత్రాలను సమర్పించారన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ ఆల్వాల రవి, డాక్టర్ హైమావతి, శ్రీనివాస్, ఉపేందర్‌రెడ్డి, కిరణ్‌కుమార్, రామచంద్ర, సముద్రాల ఉపేందర్, తదితరులు పాల్గొన్నారు.

వీధి కుక్కలను నియంత్రించేందుకు చర్యలు

కలెక్టర్ ఇలా త్రిపాఠి



జంతు జనన నియంత్రణ కేంద్రానికి శంకుస్థాపన కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

మిర్యాలగూడ, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): వీధికుక్కల జనాభాను నియంత్రించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు కలెక్టర్ ఇలా త్రిపాఠి చెప్పారు. గురువారం అవంతీపురంలో రూ.60లక్షల వ్యయం తో రెండెకరాల స్థలంలో నిర్మించనున్న జంతు జన న నియంత్రణ కేంద్రం నిర్మాణానికి ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, ఎమ్మెల్యే బీఎల్ఆర్, సబ్‌కలెక్టర్ నారాయ ణ్ అమిత్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఇటీవల కాలంలో చిన్నారులపై వీధి కుక్కల దాడులు ఎక్కువయ్యాయని అన్నారు. వీధి కుక్కల జనాభాను నియంత్రించేందుకు హైదరాబాద్ తప్ప మరెక్కడా జంతు జనన నియంత్రణ కేంద్రాలు లేవని అన్నారు. దాన్ని దృష్టిలో ఉంచుకుని జిల్లా కేంద్రంలో లాగానే మిర్యాలగూడలో కూడా జంతు జనన నియంత్రణ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఎన్జీవో సంస్థతో ఒప్పందం చేసుకున్నట్లు తెలిపారు. వీధి, పెంపుడు కుక్కలకు వ్యాక్సిన్ వేయించాలని సూచించారు. దేవరకొండలో సైతం జంతు జనన నియంత్రణ కేంద్రం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఎమ్మెల్సీ శంకర్ నాయక్ మాట్లాడుతూ, కుక్కకాటు ప్రమాదమని, నిర్లక్ష్యం చేస్తే రేబిస్ వచ్చే అవకాశం ఉందన్నారు. ఎమ్మెల్యే బీఎల్ఆర్ మాట్లాడుతూ జంతు జనన నియంత్రణ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. అనంతరం వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. మున్సిపల్ కార్యాలయంలో కార్మికులకు నిర్వహించిన వైద్యశిబిరంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ రమేశ్, మునిసిపల్ కమిషనర్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

సమీకృత పాఠశాలకు భూసేకరణ చేపట్టాలి

(ఆంధ్రజ్యోతి, నిడమనూరు): నిడమనూరు మండలం ఊట్కూరులో నిర్మించనున్న సమీకృత పాఠశాల సముదాయానికి సత్వరమే భూసేకరణ చేపట్టాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. గురువారం ఊట్కూరు గ్రామంలోని 358, 361 సర్వే నెంబర్లలోని ప్రభుత్వ భూమిని అధికారులతో కలిసి ఆమె పరిశీలించి మాట్లాడారు. ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణానికి 15 నుంచి 20ఎకరాల వరకు భూమి అవసరం ఉందన్నారు. రెండు సర్వే నెంబర్లలో 10ఎకరాల వరకు ప్రభుత్వ భూమి అందుబాటులో ఉందని అధికారులు వివరించగా, మరో ఐదు నుంచి ఏడు ఎకరాల వరకు భూసేకరణ చేపట్టాలని సూచించారు. పాఠశాలకు భూమి ఇచ్చే రైతులకు అనుముల మండలం ఇబ్రాహీంపేట వద్ద భూమి లేదా ధర చెల్లించి కొనుగోలు చేయడానికి సిద్ధమేనన్నారు. ఆమె వెంట సబ్ కలెక్టర్ అమిత్‌నారాయణ్, తహసీల్దార్ జంగాల కృష్ణయ్య, ఎంపీడీవో బోనగిరి రమేష్, మార్కెట్ కమిటీ చైర్మన్ అంకతి సత్యం, డీఈ శైలజ, సర్వేయర్ విజయ్‌కుమార్, మాజీ సర్పంచులు నర్సింగు కృష్ణయ్య, విజయ్‌కుమార్, శివమారయ్య, పోలే రవి, రూపని కృష్ణయ్య, తదితరులు ఉన్నారు.

ఓటింగ్ యంత్రాల తనిఖీ...

(ఆంధ్రజ్యోతి, నల్లగొండ): కలెక్టరేట్ గోదాంలోని ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్ని రాజకీయ పక్షాల ప్రతినిధులతో కలిసి గురువారం తనిఖీ చేశారు. ఈవీఎంల పరిశీలన అనంతరం రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో గోదాంకు సీల్ చేయించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, కలెక్టరేట్ ఏవో మోతిలాల్, ఎన్నికల విభాగం డీటీ విజయ్ కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

చరిత్రను వక్రీకరిస్తున్న బీజేపీ

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ

నల్లగొండ రూరల్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట చరిత్రను బీజేపీ వక్రీకరిస్తోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ విమర్శించారు. గురువారం దొడ్డికొమరయ్య భవనంలో జరిగిన సీపీఎం జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వాతంత్రోద్యమంలో, వీర తెలంగాణ సాయుధ పోరాటంలో బీజేపీ నాయకులు ఎవ్వరూ పాల్గొనలేదని స్పష్టం చేశారు. చరిత్రను వక్రీకరించడంలో బీజేపీ అందవేసిన చేయి అన్నారు. సాయుధ పోరాటాన్ని హిందూ ముస్లింల పోరాటంగా చిత్రీకరించేందుకు యత్నిస్తోందన్నారు. దున్నేవాడికే భూమి, స్వేచ్ఛ కోసం సాయుధ పోరాటం సాగిందని గుర్తుచేశారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వార్షికోత్సవాలను ఈ నెల 10 నుంచి 17వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్నామని, వీటిలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్నా శ్రీశైలం సొరంగం మార్గం పనులను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి, పోతినేని సుదర్శన్, జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి, ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, నారి ఐలయ్య, డబ్బికార్ మల్లేశం, బండ శ్రీశైలం, పాలడుగు నాగార్జున, కందాల ప్రమీల, సయ్యద్ హాషం, పాలడుగు ప్రభావతి, చిన్నపాక లక్ష్మీనారాయణ, వీరపల్లి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

వినాయకుడికి 108 రకాల నైవేద్యం



గణేష్ నవరాత్రుల ముగింపు సందర్భంగా నార్కట్‌పల్లిలోని వాసవీ భవన్‌లో 108 రకాల ప్రసాదాలతో గణనాథుడికి నైవేద్యం సమర్పించారు.

- ఆంధ్రజ్యోతి, నార్కట్‌పల్లి

ప్రతీ ఒక్కరు రక్తదానం చేయాలి

టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావా రవి

నల్లగొండ, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రక్తదానం ప్రాణదానంతో సమానమని, ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావా రవి అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్ర ఆస్పత్రిలో నిర్వహించిన రక్తదానం శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. రక్తదానంతో ఆపదలో ఉన్న వారికి ఎంతో ప్రయోజనం చేకూరుతుందన్నారు. రక్తదాన శిబిరాన్ని డీఈవో బొల్లారం భిక్షపతి సందర్శించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి, టీజీఈజేఏసీ జిల్లా చైర్మన్ నాగిళ్ల మురళి, టీఎస్‌యూటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బక్క శ్రీనివాసచారి, పెరుమాళ్ల వెంకటేశం, శేఖర్‌రెడ్డి, భిక్షం, రణదీవే, నర్రా శేఖర్‌రెడ్డి, గ్యారే నర్సింహ, నలపరాజు వెంకన్న, రమాదేవి, సైదులు, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులుగా

208 మంది ఎంపిక

నల్లగొండ, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా 208మందిని విద్యాశాఖ ఎంపిక చేసింది. గురువారం సాయంత్రం ఈ మేరకు విద్యాశాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. 2025 సంవత్సరానికి ఈ అవార్డులను ప్రకటించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ఉదయం 11గంటలకు నిర్వహించే కార్యక్రమంలో ఉపాధ్యాయులకు ఈ అవార్డులను రోడ్లు భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అందజేయనున్నారు. ఆయనతోపాటు ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు హాజరవుతారని డీఈవో భిక్షపతి తెలిపారు.

రాష్ట్ర ఉత్తమ అధ్యాపకుడిగా శ్రీధర్

నల్లగొండలోని నాగార్జున ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన అధ్యాపకుడు వెల్దండి శ్రీధర్‌కు రాష్ట్రస్థాయి ఉత్తమ అధ్యాపక అవార్డు లభించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ సముద్రాల ఉపేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీధర్ రెండేళ్లుగా ఎన్జీ కళాశాలలో తెలుగు అధ్యాపకుడిగా పనిచేస్తున్నారు.

యూరియా కష్టాలకు కేంద్రమే కారణం

సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి



రైతులతో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జూలకంటి

మిర్యాలగూడ, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో యూరియా కొరతకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలే కారణమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి ఆరోపించారు. గురువారం పట్టణంలోని మండల ప్రాథమిక సహకర కేంద్రాన్ని ఆయన సందర్శించి రైతులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. యూరియా ఎంత వచ్చింది? నిల్వలు ఉన్నాయా? అని సొసైటీ అధికారులను ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులకు అవసరమైన యూరియాను తెప్పించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ప్రభుత్వాల ముందస్తు ప్రణాళికా లేకపోవడంతో రైతులు ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీయేతరర ప్రభుత్వాలు ఉన్న రాష్ట్రాలకు కేంద్రం యూరియా కేటాయింపును తగ్గించి రైతులకు తీరని అన్యాయం చేస్తోందని విమర్శించారు. యూరియా కొరతతో వరి దిగుబడి భారీగా తగ్గే అవకాశం ఉందన్నారు. సొసైటీల వద్ద రైతులు వంతుల వారీగా లైన్‌లో నిలబడినా యూరియా అందడం లేదని అన్నారు. భూమిలో విత్తనం వేసిన నాటినుంచి పంట చేతికి వచ్చే వరకు రైతులు ప్రకృతి వైపరీత్యాలతో కష్టాలు ఎదుర్కొంటున్నారన్నారు. రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని తక్షణమే తగినంత యూరియా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వీరేపల్లి వెంకటేశ్వర్లు, సీపీఎం మండల కార్యదర్శి రవినాయక్, బావాండ్ల పాండు, నాగేశ్వరావునాయక్, తదితరులు పాల్గొన్నారు.

'గిరిజన తెగల మధ్య చిచ్చు పెడితే సహించేది లేదు'

కొండమల్లేపల్లి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): గిరిజన తెగల మధ్య చిచ్చు పెడితే సహించేది లేదని ఆల్ఇండియా బంజారా సేవా సంఘం మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి రమావత్ లాలునాయక్, ఇస్లావత్ సురేష్‌నాయక్ అన్నారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడారు. గిరిజన తెగల మధ్య చిచ్చు పెడుతున్న ఎమ్మెల్యే వెంకటరావు, మాజీ ఎంపీ బాబూరావుని కాంగ్రెస్ పార్టీ సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. తెగల మధ్య రిజర్వేషన్‌తో తగాదా సృష్టించే కుట్ర జరుగుతుందని ఆరోపించారు.

బీమాపై ప్రజలకు అవగాహన కల్పించాలి

మిర్యాలగూడ టౌన్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): బీమా ఆవశ్యకతపై ప్రజలకు అవగాహన కల్పించాలని డీఎస్పీ రాజశేఖరరాజు అన్నారు. పట్టణంలోని ఎల్ఐసీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన బీమా వారోత్సవాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. మారుమూల ప్రాంతాలకు బీమా సేవలు విస్తరింపజేయాలని, నాణ్యమైన సేవలందిస్తూ ప్రజల మన్ననలు పొందాలన్నారు. కార్యక్రమంలో బ్రాంచ్ సీనియర్ మేనేజర్ విజయానంద్, అసిస్టెంట్ మేనేజర్ శ్రవణ్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

డీలర్లు సామాజిక బాధ్యతతో వ్యవహరించాలి

● ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి



తిమ్మారెడ్డిగూడెంలో రేషన్ అందిస్తున్న ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

వేములపల్లి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): డీలర్లు పౌరుల పట్ల సామాజిక బాధ్యతతో వ్యవహరించి సకాలంలో సరుకులు అందించాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. మండలంలోని తిమ్మారెడ్డిగూడెంలో గురువారం నూతన రేషన్‌షాపును ఆయన ఎమ్మెల్సీ శంకర్‌నాయక్‌తో కలిసి ప్రారంభించి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తుందని అన్నారు. పేదలకు ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్లు, నూతన రేషన్‌కార్డులు, సన్నబియ్యం వంటి సంక్షేమ పథకాలను అందించి దేశంలోనే అగ్రగామిగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు స్కైలాబ్‌నాయక్, పార్టీ మండల అధ్యక్షుడు మాలి కాంతారెడ్డి, నాయకులు పుట్టల కృపయ్య, దేశిడి శ్రీనివాస్‌రెడ్డి, కందిమళ్ల సుధాకర్‌రెడ్డి, అమరారపు వెంకన్న, రాంచంద్రు, శ్రీనివాస్‌రెడ్డి, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి



నిరసన తెలుపుతున్న కార్మికులు

నాగార్జునసాగర్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ హిల్‌కాలనీలో నాట్కో ఫార్మాలో 20 సంవత్సరాలుగా క్యాజువల్ కార్మికులుగా పనిచేస్తున్న తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని కార్మికులు డిమాండ్ చేశారు. గురువారం నాట్కో ఫార్మా ఎదుట కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ తాము 20 సంవత్సరాలుగా నాట్కో ఫార్మాలో పని చేస్తున్నా నేటి వరకు తమను రెగ్యులర్ చేయలేదని, ఈ విషయంపై ఎన్నోసార్లు యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేదన్నారు. అంతేకాకుండా ఇక్కడ పనిచేస్తున్న కార్మికులకు ఉద్యోగ భద్రత లేకపోవడంతో పాటు న్యాయమైన వేతనం అందడం లేదని అన్నారు. 20 ఏళ్లుగా పని చేస్తున్న వారిని వదిలి కాంట్రాక్ట్ సిబ్బందిని ఎలా రెగ్యులర్ చేశారని ప్రశ్నించారు. ఈ ఆందోళన కార్యక్రమంలో కార్మికులు అనిల్, శ్రీను, రంగ, నాగు, అంజయ్య, ముని, అమీర్, బాలాజీ, రమేష్, అశోక్‌కుమార్, రాములు, వెంకటేష్, లాలపతి, శాంతి, కమల, రిబ్కా, దేవి, నీలా, మంగ పాల్గొన్నారు.

మీసేవా కేంద్రాన్ని నిరుద్యోగులకు కేటాయించాలి

చింతపల్లి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన మీసేవా కేంద్రాన్ని నిర్వహించేందుకు నిరుద్యోగులకు అవకాశం కల్పించాలని పలువురు యువకులు కోరారు. గురువారం తహసీల్దార్ రమాకాంత్‌శర్మకు పలువురు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలకేంద్రంలో మీసేవా కేంద్రాన్ని నిర్వహిస్తున్న వ్యక్తికి ప్రభుత్వ ఉద్యోగం వచ్చింది. అతను అప్పగించిన వ్యక్తి కూడా అవుట్ సోర్సింగ్ ఉద్యోగం చేస్తున్నాడు. వారికి ఉద్యోగం ఉన్నందున్న మీసేవా కేంద్రాన్ని నిర్వహించేందుకు నిరుద్యోగులకు అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో కొప్పుల నరేష్, సోమరాజు, ప్రదీప్, బొడ్డు మహేష్, గజ్జె అభినవ్, కుందేళ్ల శ్రీశైలం, కృష్ణ, వినోద్, బాలకృష్ణ, అంజి, శివ తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ సవరణలతో అన్ని వర్గాలకు ఊరట

మిర్యాలగూడటౌన్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ సవరణలతో దేశంలోని అన్ని వర్గాలకు ఊరట కలుగుతుందని బీజేపీ ఇండస్ట్రియల్ సెల్ జిల్లా కన్వీనర్ తల్లం అశోక్ అన్నారు. పట్టణంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నిత్యావసర వస్తువులు, గృహోపకరణాల ధరలు తగ్గేలా వస్తుసేవల పన్ను స్లాబులలో తీసుకొచ్చిన మార్పులు పేద, మధ్య తరగతి ప్రజలకు మేలు చేస్తాయన్నారు. విద్య, వైద్య, బీమా, నిర్మాణ సామగ్రి ధరలు అమాంతం తగ్గనుండటంతో అన్ని వర్గాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. రవాణా, ద్విచక్ర వాహనాలపై జీఎస్టీ కుదింపు చిరు వ్యాపారులపై ప్రభావం చూపుతుందని, ఆర్థిక ఇబ్బందులను తగ్గిస్తుందన్నారు. అయితే పనిగట్టుకుని కేంద్రప్రభుత్వాన్ని విమర్శించే కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలు జీఎస్టీ సంస్కరణలకు వ్యతిరేకిస్తూ ఆదాయం కోల్పోతామనడం అవివేకమన్నారు. సమావేశంలో పారిశ్రామిక, కార్మిక సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చేయూత అభినందనీయం

నిడమనూరు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతలు చేయూతనివ్వడం అభినందనీయమని ఎంఈవో లావూరి వెంకన్న అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు నిడమనూరుకు చెందిన ఎన్ఆర్ఐ ఉన్నం సత్యం చౌరవతో అమెరికాలోని అల్బనీ తెలంగాణ కమ్యూనిటీ బోర్డు సభ్యుల సహకారంతో అందించిన రూ.లక్ష విలువైన రెండు టీవీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను ఆదుకునేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలన్నారు. పాఠశాలకు చేయూతనిచ్చిన దాతలను అభినందించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్ఎం గౌతమ్, హెచ్ఎం చంద్రకళ, కర్నాటి శ్రీనుకుమార్, ఉన్నం శ్రీనివాస్, సక్కుబాయమ్మ, నాగేంద్ర, విశ్వనాథ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ యార్డును సందర్శించిన వ్యవసాయ విద్యార్థులు



మార్కెట్‌ను సందర్శించిన వ్యవసాయ విద్యార్థులు

నిడమనూరు, సెప్టెంబరు 4(ఆంధ్రజోతి): నాగర్‌కర్నూల్ జిల్లా పాలెంలోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయానికి చెందిన పలువురు బీఎస్సీ నాలుగో సంవత్సరం విద్యార్థులు గ్రామీణ వ్యవసాయ కృషి అనుభవ కార్యక్రమంలో భాగంగా గురువారం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డును సందర్శించారు.

ఆకర్ష్, జైభారత్, మహేందర్, జయంత్‌షా, అన్వేష్, రామకృష్ణ అనే విద్యార్థుల బృందం మార్కెట్ యార్డును సందర్శించి మార్కెట్‌లో జరుగుతున్న కొనుగోళ్లు, విక్రయాల గురించి చైర్మన్ అంకతి సత్యం, కార్యదర్శి తోట చందర్‌రావుతో మాట్లాడి తెలుసుకున్నారు. రైతుల సంక్షేమానికి తీసుకుంటున్న చర్యల గురించి వ్యవసాయ విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో కొండా శ్రీనివాస్‌రెడ్డి, శివమారయ్య, రవి, రూపని కృష్ణయ్య, శిరిశాల యాదగిరి తదితరులు ఉన్నారు.

విజృంభిస్తున్న సీజనల్ వ్యాధులు



రక్త పరీక్షల కోసం ప్రభుత్వ ఆసుపత్రిలో క్యూలో ఉన్న రోగులు

- వర్షాలు కురుస్తుండటంతో వ్యాప్తి
- దేవరకొండ ఆసుపత్రికి పెరిగిన రోగుల సంఖ్య
- 200 పడకల ఆసుపత్రిగా ఏర్పాటు చేయాలని డిమాండ్

దేవరకొండ డివిజన్‌లో వర్షాలు కురుస్తుండటంతో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. దీంతో పలువురు జ్వరం, రోగాల బారినపడుతున్నారు. దోమల బెడద అధికం కావడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి రోగుల సంఖ్య గణనీయంగా పెరిగింది. ప్రతీ రోజు 700నుంచి 800 మందికిపైగా ఓపీ పేషెంట్లు వస్తున్నారని డాక్టర్లు తెలిపారు. వర్షాలు కురవడం, వాతావరణంలో మార్పు రావడంతో జలుబు, దగ్గు, జ్వరం, కీళ్లనొప్పులతో రోగులు అవస్థలు పడుతున్నారు. దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రి వంద పడకలే ఉండటంతో సరిపోవడంలేదు. 200 పడకల ఆసుపత్రిగా ఏర్పాటు చేయాలని స్థానికులు అధికారులను కోరుతున్నారు.

- (ఆంధ్రజ్యోతి,దేవరకొండ)

దేవరకొండ ప్రాంతీయ ఆసుపత్రికి సాధారణ రోజుల్లో 500 నుంచి 600 మంది వరకు ప్రతీ రోజు రోగులు వచ్చేవారు. కానీ ఇటీవల సీజనల్ వ్యాధులు పెరగడంతో 700 నుంచి 800పైగా రోగులు ఆసుపత్రికి చికిత్స కోసం వస్తున్నారు. దేవరకొండ నియోజకవర్గంతోపాటు నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండ, గుర్రంపోడు, నాంపల్లి, మర్రిగూడ, ఇతర ప్రాంతాల నుంచి కూడా రోగులు వస్తుండటంతో ఆసుపత్రి రోగులతో కిక్కిరిసిపోతుంది. సరిపడా బెడ్లు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని డాక్టర్‌లు తెలిపారు. రోగులకు సరిపడా మందులు, ఇంజక్షన్లు అందుబాటులో ఉన్నాయని డాక్టర్లు పేర్కొంటున్నారు.

200 వరకు పడకల సంఖ్య పెంచాలి

దేవరకొండ ప్రాంతీయ ఆసుపత్రి వంద పడకల ఆసుపత్రిగా కొనసాగుతుంది. దేవరకొండ నియోజకవర్గంతో పాటు పరిసర మండలాల ప్రజలు ఆసుపత్రికి వస్తుండటంతో బెడ్లు సరిపోవడంలేదు. 200 పడకల ఆసుపత్రిగా ఏర్పాటు చేస్తేనే సమస్య పరిష్కారమవుతుందని స్థానికులు, డాక్టర్లు, సిబ్బంది పేర్కొంటున్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రస్తుతం ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా డాక్టర్ రవిప్రకాష్ విధులు నిర్వహిస్తున్నారు. ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌తో పాటు 28 మంది డాక్టర్లు విధులు నిర్వహిస్తున్నారు. ఆపరేషన్లతో పాటు డెంటల్, కంటి వైద్య నిపుణులు ఉన్నారు. ఆసుపత్రిలో ఐసీయూ గదులను ఏర్పాటు చేశారు. డయాలసిస్ బెడ్లు కూడా అందుబాటులో ఉన్నాయి. దీంతోపాటు ఆక్సిజన్ ప్లాంట్ ఏర్పాటు చేశారు. రోగులు తాగునీటికి ఇబ్బందులు పడకుండా మంచినీటి బోరు వేసి నీటిని సరఫరా చేస్తున్నారు. ఆర్‌వో ప్లాంట్ కూడా ఏర్పాటు చేస్తున్నారు. సదుపాయాలు సరిపడా ఉన్నా రోగులకు సరిపడా బెడ్లు లేకపోవడంతో ఇబ్బందులు పడే పరిస్థితి. ప్రభుత్వం, ఉన్నత అధికారులు స్పందించి 200 పడకల ఆసుపత్రిగా ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో సరిపడా బెడ్లు లేవు



దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రిలో సరిపడా బెడ్లు లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. జ్వరం వచ్చి ఆసుపత్రిలో చేరితే బెడ్డు దొరకలేదు. దీంతో ఇంజక్షన్, మందులు తీసుకొని ఇంటికి వెళ్లాను. రోగులకు సరిపడా బెడ్లు ఏర్పాటు చేయాలి.

- జహీర్‌ఖాన్, దేవరకొండ

రోగుల సంఖ్య పెరిగింది



దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి ఇటీవల రోగుల సంఖ్య పెరిగింది. వర్షాలు కురవడంతో జలుబు, దగ్గు, జ్వరాలు తదితర రోగాలతో ప్రజలు ఆసుపత్రిలో చేరుతున్నారు. రోగులకు మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నాం. సీజనల్ వ్యాధులపై ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలి. 200 పడకల ఆసుపత్రి ఏర్పాటు చేయాలని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

- డాక్టర్ రవిప్రకాష్, ఇన్‌చార్జి సూపరింటెండెంట్

గ్రామాల అభివృద్ధే కాంగ్రెస్ ధ్యేయం

● ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్

చందంపేట, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. చందంపేట మండలంలోని పొగిళ్ల గ్రామంలో 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌కు గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాబోయే రోజుల్లో నిరంతర విద్యుత్ కోసం రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉండేందుకు ఈ సబ్‌స్టేషన్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కొన్ని సంవత్సరాలుగా వేధిస్తున్న విద్యుత్ సమస్యను కాంగ్రెస్ ప్రభుత్వం పరిష్కరించిందన్నారు. అనంతరం పాత కంబాలపల్లి, ఉస్మాన్‌కుంట, బొల్లారం, తెల్‌దేవరపల్లి గ్రామాలలోని ఇందిరమ్మ ఇళ్లు, సీసీ రోడ్డు నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ, ఎంపీడీవో అధికారులు, మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సబ్‌స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్

దేవాలయ అభివృద్ధికి కృషి

నేరేడుగొమ్ము: నేరేడుగొమ్ము మండలం కాచరాజుపల్లి గ్రామపంచాయతీలోని కొండ, కోనల్లో వెలిసిన వేంకటేశ్వరస్వామి దేవాలయ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే బాలునాయక్ అన్నారు. గురువారం కాచరాజుపల్లిలోని వేంకటేశ్వరస్వామి దేవాలయాన్ని ఆయన సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. కోరిన కోర్కెలు నెరవేర్చే దైవంగా వేంకటేశ్వరస్వామికి పేరుందన్నారు. ఎమ్మెల్యే వెంట ఆలయ పూజారి బిక్కునాయక్, పాపనాయక్, ముక్కమళ్ల వెంకటయ్యగౌడ్, కృష్ణ, నాయకులు, గిరిజననేతలు, బావోజీలు పాల్గొన్నారు.

వీధి కుక్కలతో జాగ్రత్తగా ఉండాలి



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ రామదుర్గారెడ్డి

హాలియా, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): పౌరులు వీధి కుక్కల పట్ల అప్రమత్తంగా ఉండాలని హాలియా మునిసిపల్ కమిషనర్ రామదుర్గారెడ్డి అన్నారు. మునిసిపాలిటీ ఆధ్వర్యంలో హాలియాలోని కృష్ణవేణి పాఠశాలలో గురువారం వీధికుక్కల నియంత్రణ, రెబీస్ వ్యాధిపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గుంపులు గుంపులుగా తిరిగే కుక్కలు ప్రమాదకరమని, ఒంటరిగా వెళ్లకూడదన్నారు. ఇంట్లో పెంచే కుక్కలను నిర్లక్ష్యంగా బయటకు వదలి పెట్టకూడదని సూచించారు. రెబీస్ వ్యాధి ప్రాణాంతకమని, వీధి కుక్కల నుంచి ఈ వ్యాధి వ్యాప్తి చెందే అవకాశాలు అధికంగా ఉంటాయని, కాబట్టి కుక్కకాటు వేస్తే 24 గంటలలోపు తప్పనిసరిగా రేబీస్ ఇంజక్షన్ వేయించుకోవాలని సూచించారు. పట్టణంలో శునకాల నియంత్రణ చర్యలను మరింత బలోపేతం చేసేందుకు మునిసిపాలిటీ కట్టుదిట్టమైన చర్యలు తీసుకుటుందని తెలిపారు. అనంతరం విద్యార్థులకు రేబీస్ వ్యాధి నివారణ చర్యలు, శునకాల నియంత్రణ పద్ధతులు, పరిశుభ్రత ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మునిసిపల్ పర్యావరణ ఇంజనీర్ రవికుమార్, మునిసిపల్ సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ సిబ్బంది సస్పెన్షన్

ఉత్తర్వులు జారీ చేసిన కలెక్టర్

పెద్దవూర, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): పెద్దవూర పీఏసీఎస్‌లో యూరియాను ప్రైవేట్ వ్యక్తులకు అక్రమంగా విక్రయించిన పీఏసీఎస్ సీఈవో వెంకట్‌రెడ్డి, సేల్స్ అధికారి మన బ్రహ్మచారిలను సస్పెండ్ చేస్తూ జిల్లా ఇలా త్రిపాఠి గురువారం ఆదేశాలు జారీ చేశారు. సహకార సంఘంలో పాత స్టాక్ అయిన 700 బస్తాల యూరియాను బినామీ రైతుల పేరుతో విక్రయించారు. విచారణ జరిపిన అనంతరం అక్రమంగా విక్రయించారనేది రుజువు కావడంతో వారిద్దరిని సస్పెండ్ చేస్తూ ఆదేశాలను జారీ చేశారు.

నిమజ్జనం శాంతియుతంగా నిర్వహించాలి

● డీజేలకు అనుమతి లేదు

● దేవరకొండ సీఐ వెంకట్‌రెడ్డి

దేవరకొండ, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): దేవరకొండలో ఈ నెల 5వ తేదీన నిర్వహించనున్న గణేష్ నిమజ్జన వేడుకలను ప్రశాంతంగా, ఆనందోత్సవాలతో నిర్వహించుకోవాలని దేవరకొండ సీఐ వెంకట్‌రెడ్డి నిర్వాహకులను కోరారు. దేవరకొండలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 5న ఉదయం 10 గంటలకు పాత రామాలయం నుంచి గణేష్ శోభయాత్ర ప్రారంభమవుతుందన్నారు. నిర్వాహకులు పోలీస్‌శాఖ సూచించిన విధంగా సీరియల్ ప్రకారం ర్యాలీగా ఊరేగింపు నిర్వహించుకోవాలని, డీజేలకు అనుమతిలేదని తెలిపారు. నిమజ్జనం కోసం కొండభీమనపల్లి ప్రాజెక్టు వద్ద ఏర్పాట్లు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. గణేష్ నిర్వాహకులు నిమజ్జన వేడుకలను ప్రశాంతంగా నిర్వహించి పోలీసులకు సహకరించాలని కోరారు.

శాంతిభద్రతల పరిరక్షణకు కృషి : రాంమూర్తి

చింతపల్లి: శాంతిభద్రతల పరిరక్షణకు తన వంతుగా కృషి చేస్తానని ఎస్ఐ ఎం.రాంమూర్తి తెలిపారు. చింతపల్లి మండల కేంద్రానికి చెందిన కిరాణ, వ్యాపారస్థుల సహకారంతో గురువారం రూ. 1లక్ష విలువ చేసే సీసీ కెమెరాలను చౌరస్తాలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీసీ కెమెరాల ఏర్పాటుతో గుర్తు తెలియని వ్యక్తుల కదిలికలతో పాటు దొంగతనాలను పూర్తిగా నిర్మూలించే అవకాశం ఉంటుందన్నారు. సాగర్-హైదరాబాద్ ప్రధాన రాష్ట్ర రహదారిపై ప్రమాదాల నివారణకు సీసీ కెమెరాలతో సమాచారం తెలుసుకొనే అవకాశం ఉంటుందన్నారు. వేంకటేశ్వరనగర్ (మాల్)లో సైతం సీసీ కెమెరాల ఏర్పాటు కోసం త్వరలోనే సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తుగా ప్రజలందరూ పోలీసులకు సహకరించాలని కోరారు.

నేడు గణేష్ నిమజ్జన శోభాయాత్ర

(3వ పేజీ తరువాయి)

పోలీసులు రూట్ మ్యాప్‌ను రూపొందించారు. మధ్యాహ్నం 1గంట వరకు మొదటి విగ్రహం క్లాక్‌టవర్ సెంటర్‌కు చేరుకుంటుంది. హైదరాబాద్ రోడ్, రామగిరి, గొల్లగూడ, తదితర ప్రాంతాల నుంచి వినాయక విగ్రహాలు ప్రకాశం బజార్ మీదుగా 14వ మైలురాయి దగ్గరకు వెళ్లేలా, మిగతా విగ్రహాలు అర్జాలబావి దగ్గరలోని బతుకమ్మకుంటలో నిమజ్జనం చేసేలా అధికారులు రూట్‌మ్యాప్ రూపొందించారు.

గణేష్ విగ్రహాలు తొమ్మిది అడుగులకు పైగా ఉన్నవాటిని 14వ మైలురాయి కాల్వ వద్ద, ఆ లోపు ఉన్న విగ్రహాలను అర్జాలబావిలోని బతుకమ్మ కుంట వద్ద నిమజ్జనం చేసేలా అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. ఇప్పటికే ఆయా ప్రాంతాల్లో వినాయకులను నిమజ్జనం చేసేందుకు క్రేన్లు, లైట్లు, గజ ఈతగాళ్లు, తదితర సౌకర్యాలను కల్పించారు. గణేష్ నిమజ్జన శోభాయాత్రను ప్రశాంతంగా నిర్వహించాలని గణేష్ ఉత్సవ సమితి అధ్యక్షుడు యాదగిరి పిలునిచ్చారు.

అన్ని ఏర్పాట్లు చేయాలి : కలెక్టర్, ఎస్పీ

(ఆంధ్రజ్యోతి, హాలియా): వినాయక నిమజ్జనానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తిచేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అధికారులను ఆదేశించారు. గురువారం హాలియా మునిసిపాలిటీ పరిధిలోని 14వ మైలురాయి వద్ద నిమజ్జన స్థలాన్ని వారు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, వినాయక నిమజ్జనానికి క్రేన్లను ఏర్పాటు చేసి గజ ఈతగాళ్లను సిద్ధం చేయాలన్నారు. లైటింగ్, తాగునీరు, బందోబస్తు వంటి సౌకర్యాలను పూర్తి స్థాయిలో కల్పించాలని ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి నిమజ్జనంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా చూడాలన్నారు. వారి వెంట అదనపు కలెక్టర్ నారాయణ్ అమిత్, డీఎస్పీ శివరాంరెడ్డి, మునిసిపల్ కమిషనర్ మందడి రామదుర్గారెడ్డి, సీఐ సతీష్‌రెడ్డి, ఎస్ఐ సాయిప్రశాంత్, ఎంపీడీవో సుజాత, తదితరులు ఉన్నారు.

వైభవంగా గణనాథుని శోభాయాత్ర



వీటీనగర్‌లో శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

చింతపల్లి, సెప్టెంబరు4(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటేశ్వరనగర్ మార్కండేయస్వామి ఆలయంలో పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథునికి గురువారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ మేరకు పట్టణానికి చెందిన మల్లీశ్వరి భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. గణపతి లడ్డూను పట్టణానికి చెందిన అంకం శ్రీనివాస్ వేలంపాటలో రూ.20116 దక్కించుకున్నారు. పద్మశాలీ మహిళలు మల్లీశ్వరిని ఘనంగా సన్మానించారు.

సాయిప్రతాప్‌నగర్‌లో అన్నదాన కార్యక్రమం



అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న రామదుర్గారెడ్డి

హాలియా: హాలియా పట్టణంలోని సాయిప్రతాప్‌నగర్‌లో గణేష్ ఉత్సవ కమిటీ వద్ద కొరివేని గూడెం మాజీ ఎంపీడీసీ మేడ నర్సింహారెడ్డి అరుణ దంపతుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. మునిసిపల్ కమిషనర్ రామదుర్గారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వినాయకుని వద్ద ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించి మాట్లాడారు. ప్రశాంత వాతావరణంలో గణేష్ నిమజ్జన ఉత్సవాలు నిర్వహించుకోవాలని కోరారు. కార్యక్రమంలో కమిటీ నిర్వాహకులు పుచ్చకాయల రమణారెడ్డి, దూసరి నాగయ్య, చెన్ను నాగిరెడ్డి, కూన్‌రెడ్డి సంజీవరెడ్డి, లక్క వెంకట్‌రెడ్డి, మల్లిఖార్జున్‌రెడ్డి, నక్కల అయ్యప్పరెడ్డి, వెంగల్‌రావు, అంకారావు, సుబ్బారావు, జైపాల్‌రెడ్డి, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రూ.60,116 పలికిన వినాయక లడ్డూ



వినాయక లడ్డూను దక్కించుకున్న కుర్ర రాములుయాదవ్

మిర్యాలగూడ రూరల్: మండలంలోని అవంతీపురం గ్రామంలో బొడ్రాయి వద్ద ఫ్రెండ్లీ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ లడ్డూ వేలంపాట నిర్వహించారు. గ్రామానికి చెందిన కుర్ర రాములుయాదవ్ కుటుంబసభ్యులు రూ.60,116కు దక్కించుకున్నారు. కార్యక్రమంలో పగడాల చిన్నలక్ష్మయ్య, వల్దాస్ సురేష్, జవ్వాజి నాగశేషాద్రి, దాసరి కుమార్, కుర్ర నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వేలంలో లడ్డూ కైవసం చేసుకున్న ముస్లిం



లడ్డూను తీసుకెళ్తున్న సలీం

వేములపల్లి: మండలంలోని శెట్టిపాలెం గ్రామంలో ఛత్రపతి శివాజీ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ మండపం వద్ద బుధవారం రాత్రి లడ్డూపాట నిర్వహించారు. శెట్టిపాలెం గ్రామానికి చెందిన ముస్లిం సోదరుడు షేక్ సలీం రూ. 29,900కు లడ్డూను దక్కించుకున్నారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ గ్రామంలో కులమతాలకతీతంగా మత సామరస్యంతో మెలుగుతున్నామనడానికి ఈ వేలంపాట నిదర్శనమని అన్నారు.

తీరు మారడం లేదు!

(3వ పేజీ తరువాయి)

చింతలపాలెం ఎస్ఐ అంతిరెడ్డి బియ్యం అక్రమరవాణా కేసులో అరెస్టయిన వ్యక్తికి స్టేషన్ బెయిల్ ఇచ్చే అంశంలో రూ.10వేల లంచం తీసుకుంటూ పట్టుబట్టారు.

● సూర్యాపేట జిల్లా కేంద్రంలో నకిలీ వైద్యుల కేసు విషయంలో సూర్యాపేట సీఐ వీరరాఘవులు, డీఎస్పీ పార్థసారధి రూ.16లక్షల లంచం డిమాండ్ చేయగా, వారు ఏసీబీని ఆశ్రయించగా మే 12న రెడ్‌హ్యాండెడ్‌గా ఆధారాలతో సహా పట్టుకొని అరెస్ట్ చేశారు.

● పెన్‌పహాడ్ మండలం నాగులపాటి అన్నారం గ్రామానికి చెందిన పంచాయతీ కార్యదర్శి రూ.8వేల లంచం తీసుకుంటూ జూన్ 26న ఏసీబీకి చిక్కాడు.

● జూన్ 26న హుజూర్‌నగర్ తహసీల్దార్ కార్యాలంలో భూభారతి ఆపరేటర్ విజేతారెడ్డి రూ.12వేల లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డారు.

● జూలై 7న పౌరసరఫరాలశాఖ మిర్యాలగూడ డీటీ జావెద్ ఏసీబీకి పట్టుబట్టారు. బియ్యం అక్రమరవాణా కేసులో పట్టుబడిన మూడు వాహనాలకు రిలీజింగ్ ఆర్డర్ ఇచ్చేందుకు వాహన యజమానులను రూ.1లక్ష లంచం అడగ్గా, వారు ఇవ్వలేమని చెప్పినా వినకుండా కనీసం రూ.70వేలు ఇవ్వాలని డిమాండ్ చేసి రిలీజింగ్ ఆర్డర్ ఇవ్వకపోవడంతో వారు ఏసీబీని ఆశ్రయించారు. ఏసీబీ అధికారులు జావేద్‌ను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకొని అరెస్ట్ చేసి నాంపల్లి ఏసీబీ కోర్టులో హాజరుపరిచారు.